RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 53 పేజీలు - 08 మంగళవారం 20 జనవరి 2026

## ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు సిట్ నోటీసులు

**- నేడు విచారణకు హాజరు కావాలని ఆదేశం**



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి19:** తెలంగాణ రాష్ట్ర ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ నోటీసులు ఇచ్చింది. మంగళవారం ఉదయం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని హరీష్ రావుకు పంపిన నోటీసుల్లో పేర్కొంది. ఈ కేసులో ఇతర నిందితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా హరీష్ రావుకు సిట్ నోటీసులు పంపించింది. ఇటీవల ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు విచారణపై దర్యాప్తు సంస్థను సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఇప్పటికే రెండు వారాల కస్టడీకి అనుమతించామని, ఇంకెంత కాలం విచారణ కొనసాగిస్తారని ప్రశ్నించింది. ఈ కేసులో విచారించడానికి ఇంకా ఏమి మిగిలి ఉందని ప్రశ్నించింది. ప్రభాకర్ రావు విచారణను త్వరగా పూర్తి చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.



## ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదు

**- పోలండ్ విదేశాంగ మంత్రితో భేటీలో జైశంకర్**

**- ఉగ్రవాద నిర్మలనకు కలసి పనిచేస్తామని పోలండ్ హామీ**

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి19:** ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ భారత్ సమర్థించదని, ప్రపంచ దేశాలను కూడా ఇదే కోరుతోందని విదేశాంగ మంత్రి జై శంకర్ స్పష్టం చేశారు. పోలండ్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి అయిన రాడోస్లావ్ సికోర్స్కి బజీలి తో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ దిల్లీలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఇరుదేశాల మధ్య సంబంధాలపై చర్చలు మిగతా2లో...

# వనదేవతల గద్దెలు దేదీప్యమానం

**తొలి అక్షరం/మేడారం,జనవరి19:** ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి - ఆలయంలో నూతనంగా నిర్మించిన గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని పునఃప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి - ఆలయం చుట్టూ ఆకట్టుకుంటున్న గిరిజన శిల్పాలు మేడారంలో నూతనంగా నిర్మించిన అమ్మవారి గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భక్తులకు అంకితం చేశారు. ఆదివాసీ సంస్కృతి ఉట్టి పడేలా అత్యద్భుతంగా పునర్నిర్మాణం చేసిన ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి పొందిన మేడారం మహా జాతరను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఆదివారం రాత్రి మేడారంలో బస చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆలయ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొననున్నారు. పునర్నిర్మాణం చేసిన ఆలయంలో కొలువుదీరిన సమ్మక్క సారలమ్మ ప్రాంగణాన్ని ప్రారంభించారు. తొలుత అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం కుటుంబ సమేతంగా వన దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఏళ్ల నాటి కోయల తాళపత్ర గ్రంథాల్లోని విశేషాలకు శిల్ప రూపం దిద్దుకుంది. చారిత్రక కట్టడాల తరహాలో అద్భుత కట్టడం ఆవిష్కృతమైంది. సమ్మక్క-సారలమ్మ మహాజాతర మిగతా2లో...

**వనదేవతల గద్దెలు దేదీప్యమానం**

**మేడారంలో పైలాన్ ఆవిష్కరించి,గద్దెలను పునః ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి**

**మేడారాన్ని అభివృద్ధి చేయడం నా అదృష్టం**



## పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా చర్యలొద్దు

**- తెలంగాణ హైకోర్టు విచారణ...**

**ఫిబ్రవరి 25కు వాయిదా**




## బిజెపి నూతన అధ్యక్షుడుగా నితిన్ నబీన్

**● నితిన్‌కు మద్దతుగా నామినేషన్లు ● పోటీలో ఎవరూ లేకపోవడంతో ఏకగ్రీవ ఎన్నిక ● నేడు ప్రముఖుల సమక్షంలో ప్రమాణ స్వీకారం**



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,19:** భారతీయ జనతా పార్టీ చరిత్రలో సరికొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. పార్టీ అధ్యక్షుడిగా అత్యంత పిన్న వయస్కుడైన నేత నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నామినేషన్లు అన్నీ ఆయన ఒక్కరి పేరుమీదే దాఖలు అయ్యాయి. నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ మంగళవారం అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఢిల్లీలో నితిన్ ప్రమాణ మిగతా2లో...

## ఏడాదిన్నరలో రూ.23.5 లక్షల కోట్ల పెట్టుబడులు

**● ఏపీ ఐటిశాఖ మంత్రి లోకేశ్ వెల్లడి**




**తొలి అక్షరం/అమరావతి,జనవరి19:** తెలుగు వారు అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా ఉండాలని ఏపీ ఐటిశాఖ మంత్రి లోకేశ్ ఆకాం క్షించారు. స్విట్జర్లాండ్‌లో పర్యటిస్తున్న ఆయన జ్యూరిక్‌లో తెలుగు దయాస్పోరాతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లా డుతూ.. సముద్రాలు దాటి వచ్చినా మన సంప్ర దాయాలు కొనసాగిస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమానికి 20 దేశాల మిగతా2లో...

## సిరిసిల్ల పవర్‌లూమ్‌పై కేంద్రం వివక్ష

**- 8మంది ఎంపిలు ఉన్నా అన్యాయమే**

**- కేంద్రమంత్రులకు అనేక లేఖలు రాసినా శూన్యం**

**- మరోమారు కేంద్రమంత్రి గిరిరాజ్‌కు కెటిఆర్ లేఖ**



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి19:** సిరిసిల్ల మెగా పవర్ లూమ్ క్లస్టర్ మంజూరు విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్దేశపూర్వక జాప్యం , వివక్షాపూరిత వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కె. తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు లేఖ రాశారు. సిరిసిల్లలో మెగా పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటు డిమాండ్ నిన్న మొన్నటిది కాదని, గత పదేళ్లుగా తాము నిరంతరాయంగా పోరాడుతున్నామని గుర్తు చేశారు. గతంలో మంత్రిగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా, సిరిసిల్లా శాసన సభ్యుడిగా పూర్వపు టెక్స్ టైల్ శాఖా మంత్రులకు రాసిన అనేక లేఖలు, అనేక వ్యక్తిగత మిగతా2లో...

## అరబ్ అధ్యక్షుడు షేక్ రాక

**- స్వయంగా వెళ్లి స్వాగతించిన ప్రధాని మోడీ**




**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జనవరి19:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత్ పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా దిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ప్రధాని మోదీ స్వయంగా స్వాగతం పలికారు. కరచాలనం చేసి, ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. అనంతరం ఇద్దరూ మిగతా2లో...

## నైనీ బొగ్గు గనుల టెండర్లపై సీబీఐ విచారణ

**● అక్రమార్కులపై ఎందుకు చర్యలు తీసుకోరు**

**● పోలీస్ అధికారులకు హరీష్ రావు సూటి ప్రశ్న**




**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి19:** నైనీ బొగ్గు గనుల టెండర్లపై సీబీఐ విచారణకు ఆదేశించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. భాజపా, కాంగ్రెస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు ఆరు గ్యారంటీలను పక్కన పెట్టి వాటాల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు. ఔట్ సోర్సింగ్ సీఎంకు.. అసలైన కాంగ్రెస్ వాదులకు మధ్య వార్ నడుస్తోందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నాయకుల అరాచ కాలపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. వ్యాపారులను తుపాకులతో బెదిరించి, కమీషన్లు వసూలు చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ కుమార్తె చెప్పిందని గుర్తుచేశారు. సీఎం సన్నిహితుడు రోహిన్ రెడ్డి బెదిరించాడని మంత్రి కుమార్తె చెప్పిందని తెలిపారు. అలంపూర్‌లో రేవంత్ రెడ్డి సన్నిహితుడు, ఏఐసీసీ నేత ఎమ్మెల్యే సంపత్ కుమార్ రూ. 8 కోట్లు కావాలని మిగతా2లో...

## మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు

**● ఆదిలాబాద్‌కు సుదర్శన్ రెడ్డి, నిజాబాద్‌కు ఉత్తమ్**



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి19:** తెలంగాణలో త్వరలో జరగబోయే మున్నిపల్ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ ఎన్నికలకు ఇన్‌ఛార్జ్‌లుగా మంత్రులను నియమిస్తూ కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంది. పార్లమెంట్ వారీగా ఆయా మంత్రులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించింది. 15 నియోజకవర్గాలకు గానూ 15 మంది మంత్రులు ఇన్‌ఛా ర్జ్‌లుగా బాధ్యతలు నిర్వహించ నున్నారు. రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. సంబంధిత రిజర్వేషన్లు ఇప్పటికే ఖరారయ్యాయి. త్వరలో నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. ఫిబ్రవరి మొదటి లేదా రెండో వారంలో ఎన్నికలు జరగనున్నట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌లుగా మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆదిలాబాద్‌కు మాత్రం ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ఈ క్రమంలో నిజామాబాద్‌కు ఉత్తమ్ కుమార్ రెడ్డి నియమితులయ్యారు. మల్కాజిగిరి - కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, చేవెళ్ల -దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కరీంనగర్-తుమ్మల మిగతా2లో...

## ప్రతి ఇంటిని సోలార్ ఎనర్జీ కేంద్రంగా మార్పు

**ఆదాయంతో పాటు విద్యుత్ ఆదా...**

**బోనకల్లులో ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి**



# నైనీ బొగ్గు గనుల టెండర్లపై సీబీఐ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

కాంట్రాక్టర్లను బెదిరించాడని తెలిపారు. ఈ ఘటనపై స్వయంగా కాంట్రాక్టరే వచ్చి ఫిర్యాదు చేశాడని.. అయినా ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. దీనిపై సిట్ ఏది అని నిలదీశారు. జర్నలిస్టులను వేధించడానికి సిట్‌లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులను వేధించడానికి సిట్‌లు, కమిషన్లు ఏర్పాటు చేస్తున్నారని.. మరి సంపత్ మీద సిట్ ఉండదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఖాకీ బుక్ అందరికీ సమానమే అని నీతులు చెప్పారు కదా.. ఇప్పుడు ఏమైందని డీజీపీ శివధర్ రెడ్డిని ప్రశ్నించారు. మీ ఖాకీ బుక్‌ను కాకి ఎత్తుకుపోయిందా అని ఎద్దేవా చేశారు. జర్నలిస్టులను బెదిరించిన సీపీ సజ్జనార్ రూల్ బుక్ ఏమైందని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి తెల్వకుండా సిట్ వచ్చిందని చెబుతున్నారని హరీశ్‌రావు అన్నారు. రేవంత్ రెడ్డికి తెల్వకుండా సిట్ వస్తే ముఖ్యమంత్రిగా ఫెయిల్ అయినట్లే కదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి తెలియకుండా సిట్ ఎలా వస్తుందని నిలదీశారు. రాష్ట్ర అడ్మినిస్ట్రేటర్ అయిన సీఎం ఏం చేస్తున్నాడని అడిగారు. ఇకపోతే బీఆర్ఎస్ జెండాలను కూల్చాలని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ధ్వజమెత్తారు. బిడ్డా రేవంత్! బీఆర్ఎస్ జెండా గద్దెల జోలికొస్తే.. నీ గద్దె కూలడం ఖాయం, జాగ్రత్త అని హెచ్చరించారు. బీఆర్ఎస్ గద్దెలను కూల్చితే దుమ్ము.. దుమ్ము అయిపోతావ్ అని వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ ప్రజల గుండెల్లో పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని తెలిపారు. హౌలా మాటలు బంద్ పెట్టి.. ముందు ఆరు గ్యారంటీలు అమలు చేయాలని హితవు పలికారు. కేబినెట్‌లో రైతుబంధు, ఎరువులు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై చర్చ జరగలేదని హరీశ్‌రావు తెలిపారు. 20 లక్షల విద్యార్థుల జీవితాలతో రేవంత్ రెడ్డి ఆటలాడుకుంటున్నాడని మండిపడ్డారు.

రాజీవ్ గాంధీ అప్పటి సీఎం అంజయ్యను అవమానించారని, ఆ అవమానంతోనే టీడీపీ ఆవిర్భవించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ భూస్థాపితం కావాలనే టీడీపీని నెలకొల్పారని తెలిపారు. కాంగ్రెస్ భూస్థాపితం చేయడానికి గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఎన్టీఆర్ పోరాడాడని పేర్కొన్నారు. ఎన్టీఆర్‌కు మనశ్శాంతి కలగాలంటే కాంగ్రెస్ భూస్థాపితం కావాలన్నారు. ఎన్టీఆర్ గురించి మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి లేదనే స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి టీడీపీ గురించి మాట్లాడుతున్నాడంటే బీజేపీతో అక్రమ సంబంధం ఉన్నట్టే కదా అని ప్రశ్నించారు.

# వనదేవతల గద్దెలు దేదీప్యమానం

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణ పనులు చరిత్రలోనే ఓ మైలు రాయిగా నిలిచిపోయేలా సర్కార్ చేపట్టింది. రాతిశిలలతో అభివృద్ధి పనులకు ప్రాణం పోయగా, 4 వేల టన్నుల గ్రానైట్‌పై ఆదివాసీ చరిత్ర సంస్కృతి తెలియజేసేలా 7 వేల చిత్రాలను హృద్యంగా చిత్రీకరించారు. సెప్టెంబర్ 23న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలయ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టగా మూడు నెలల వ్యవధిలోనే పనులను పూర్తి చేశారు. సమ్మక్క సారలమ్మ చరిత్ర, పునర్నిర్మాణ నిర్మాణ పనులు ఆదివాసీల మూలాలు జాతర చరిత్రను కళ్లకు కట్టినట్టుగా నిర్మాణాలు చేపట్టారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీటవేస్తూ చరిత్రను కళ్లకు కట్టే విధంగా వందల ఏళ్లు చెక్కు చెదరకుండా పనులు పూర్తి చేశారు. గద్దెల ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రాకార నిర్మాణాన్ని పూర్తి చేశారు.

వీటి మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పున ప్రధాన స్వాగత తోరణం, వృత్తాకారంలో ఉండే గద్దె చుట్టూ 8 స్తంభాలు, మధ్యలో వెదురు బొంగులతో తీర్చిదిద్దారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణం గోడలపై చిహ్నాలు చెక్కారు. ప్రధాన స్వాగత తోరణంపై సమ్మక్క వంశీయుల చరిత్ర తెలిపే 59 బొమ్మలు అబ్బుర పరుస్తున్నాయి. దాదాపు 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించి ఏడు వేల చిత్రాలను ఏర్పాటు చేశారు.

# సిరిసిల్ల పవర్‌లూమ్‌పై కేంద్రం వివక్ష

(మొదటి పేజీ తరువాయి)

సమావేశాలు , అధికారిక విజ్ఞప్తులు ఇప్పటివరకు కేంద్రం నుండి ఎటువంటి సానుకూల నిర్ణయానికి నోచుకోకపోవడం అన్యాయమన్నారు. అరుణ్ జైట్లీ , స్మృతి ఇరానీ మొదలుకొని నేటి మంత్రి వరకు ప్రతి ఒక్కరినీ బతిమిలాడాం. రాష్ట్రం నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు, కేంద్ర కేంద్రం వివక్షకేవలం ఉత్సవ విగ్రహాల్లా మారారన్నారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నా, కేంద్ర మంత్రివర్గంలో చోటు ఉన్నా, సిరిసిల్ల నేతన్నల గోడును వినిపించడంలో వారు విఫలమయ్యారని కేటీఆర్ ఆరోపించారు. వచ్చే కేంద్ర బ్జడెట్‌లోనైనా సిరిసిల్ల ' మెగా పవర్ లూమ్ క్లస్టర్ 'ను అధికారికంగా ప్రకటించి, ఈ పదేళ్ల అన్యాయానికి ముగింపు పలకాలని డిమాండ్ చేశారు. సీపీసీడీఎస్ నిబంధనల ప్రకారం సిరిసిల్లకు అన్ని అర్హతలు ఉన్నాయని కేంద్ర బృందాలే ధ్రువీకరించినా, ÷ల్లెను పక్కన పెట్టడం వెనుక ఉన్న మర్మమేమిటి? అని ప్రశ్నించారు. తెలంగాణ అంటే కేంద్రానికి ఎందుకంత కక్ష? అని ప్రశ్నించారు. ఇది కేవలం నిర్లక్ష్యం కాదు. తెలంగాణ అభివృద్ధిని, ముఖ్యంగా ఇక్కడి నేతన్నల పట్ల కేంద్రం చూపుతున్న వివక్ష అని కేటీఆర్ ధ్వజమెత్తారు. సిరిసిల్ల తెలంగాణ వస్త్ర పరిశ్రమకు గుండెకాయలాంటిదని పేర్కొన్నారు. సిరిసిల్ల లో 30 వేలకు పైగా పవర్ లూమ్స్ కలిగి ఉండి, వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. సిరిసిల్ల కంటే తక్కువ సామర్థ్యం, తక్కువ కార్మిక శక్తి ఉన్న ఇతర రాష్ట్రాలలోని ప్రాంతాలకు మెగా క్లస్టర్లను మంజూరు చేసిన కేంద్రం, అన్ని అర్హతలు ఉన్న సిరిసిల్లను పక్కన పెట్టడం ప్రాంతీయ వివక్షకు పరాకాష్ట అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మెగా క్లస్టర్ ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు, నిరంతర విద్యుత్, నీరు, సింగిల్ విండో అనుమతులు , రాష్ట్ర స్థాయి ప్రోత్సాహకాలు.. ఇలా ప్రతి ఒక్క అర్హతను పూర్తి చేసిందని కేటీఆర్ వివరించారు. ఇవన్నీ సిద్ధంగా ఉన్నాయని పదేపదే చెబుతున్నా, ఎటువంటి సాంకేతిక లేదా ఆర్థిక కారణాలు చూపకుండా కేంద్ర మంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదనను పెండింగ్‌లో పెట్టడం సిగ్గుచేటు అని ఎండగట్టారు. ఒకవైపు ' మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' అని గొప్పలు చెప్పుకుంటున్న కేంద్రం, తెలంగాణ విషయంలో ద్వంద నీతికి, చిత్తశుద్ధిలేమికి అద్దంపడుతుందన్నారు. ÷ూష్ట్రంలో కాంగ్రెస్ పాలన వచ్చిన నాటి నుంచి చేనేత రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మళ్లీ ఆత్మహత్యల వార్తలు వినాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నేతన్నలకు అండగా నిలిచింది. కానీ నేడు పరిస్థితులు మారుతున్నాయి. ఇటువంటి కీలక సమయంలో కేంద్రం జోక్యం చేసుకుని మెగా క్లస్టర్‌ను మంజూరు చేయాల్సి ఉండగా, తీవ్రమైన జాప్యం చేయడం నేతన్నల పొట్ట కొట్టడమే అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ప్రతి ఇంటిని సోలార్ ఎనర్జీ కేంద్రంగా మార్పు

**ఆదాయంతో పాటు విద్యుత్ ఆదా...**

**బోనకల్లులో ప్రారంభించిన డిప్యూటి సిఎం భట్టి**

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి19:** రాష్ట్రంలో ఒక సరికొత్త సోలార్ విప్లవానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శ్రీకారం చుట్టారు. ఈ పథకం ప్రధాన ఉద్దేశం ప్రతి ఇంటిని ఒక విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చడమేనని అన్నారు. ఇకపై ప్రజలు విద్యుత్ శాఖకు బిల్లులు చెల్లించే రోజులు పోయి, విద్యుత్ శాఖే ప్రజలకు డబ్బులు చెల్లించే రోజులు వచ్చాయని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలోని రావినూతల గ్రామం సాక్షిగా దీనికి భట్టి శ్రీకారం చుట్టారు. తెలంగాణ ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం అత్యంత భారీగా నిధులను వెచ్చిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 81 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా దీనిని అమలు చేస్తుండగా, ఒక్క బోనకల్ మండల పరిధిలోనే 306 కోట్ల రూపాయలను కేటాయించారు. అందులోనూ రావినూతల గ్రామంలోని ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ వ్యవస్థల ఏర్పాటు కోసమే 24 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం గమనార్హం. ఈ పథకం ద్వారా ప్రజలకు చేకూరే ఆర్థిక ప్రయోజనాలు అత్యంత ఆకర్షణీయంగా ఉన్నాయి. ప్రతి కుటుంబం తమ ఇంటిపై ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానెళ్ల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుని, తమ అవసరాలకు వాడుకోగా మిగిలిన కరెంటును ప్రభుత్వానికి విక్రయించవచ్చు. ఇలా విక్రయించిన ప్రతి యూనిట్‌కు ప్రభుత్వం రూ. 2.57 పైసల చొప్పున నేరుగా లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తుంది. దీనివల్ల ప్రతి ఇంటికి ఏడాదికి సుమారు 15 వేల రూపాయల వరకు విద్యుత్ ఆదా అవ్వడమే కాకుండా, అదనపు విద్యుత్ అమ్మకం ద్వారా మరో 5 వేల రూపాయల వరకు నగదు ఆదాయం లభిస్తుంది. అంటే ప్రతి ఏటా ఒక కుటుంబం సుమారు 20 వేల రూపాయల ఆర్థిక వెసులుబాటును పొందుతుంది. ఈ మొత్తాన్ని మహిళలు తమ పిల్లల చదువులకో లేదా ఇతర ఇంటి అవసరాలకో వాడుకోవచ్చని భట్టి విక్రమార్క సూచించారు. కేవలం గృహ వినియోగ దారులకే కాకుండా, రైతులకు కూడా ఈ పథకం ద్వారా 'డబుల్ ధమాకా' లభించనుంది. పొలాల్లోని వ్యవసాయ పంపుసెట్లకు ప్రభుత్వం తన సొంత ఖర్చుతో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తుంది. పంట లేని సమయంలో లేదా మోటార్లు వాడనప్పుడు కూడా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం కలుగుతుంది. అంతేకాకుండా, ఈ సోలార్ ప్యానెళ్లను ఎనిమిది అడుగుల ఎత్తులో ఏర్పాటు చేయడం వల్ల వాటి కింద ఒక పక్కా షెడ్డు లాంటి వసతి ఏర్పడుతుంది. అక్కడ రైతులు పశువులను కట్టుకోవ డానికి, వ్యవసాయ పరికరాలు దాచుకోవడానికి లేదా మధ్యాహ్న సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి వీలుంటుంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 'గ్రీన్ ఎనర్జీ'ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, రైతులు కూడా వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు పొలాల్లో చెత్తను కాల్చవద్దని డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు.

# స్పీకర్‌పై బిజెపి కోర్టు ధిక్కరణ కేసు

**• నోటీసులు జారీ చేసిన సుప్రీం**



**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి19:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డ ప్రసాద్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేయడంతో.. సర్వోన్నత న్యాయస్థానం ఆ పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది. అయితే మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌పై సమాధానం చెప్పాలని స్పీకర్‌కు నోటీసులు ఇచ్చింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పును స్పీకర్ అమలు చేయలేదని ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పిటిషన్ వేశారు. దాంతో సమాధానం చెప్పాలంటూ స్పీకర్‌కు సంజయ్ కరోల్ ధర్మాసనం నోటీసులు ఇచ్చింది. అదేవిధంగా మహేశ్వర్‌రెడ్డి పిటిషన్‌ను పాడి కౌశిక్‌రెడ్డి, కేటీఆర్ పిటిషన్‌లతో జతచేసింది. అన్ని పిటిషన్‌లపై కలిపి విచారణను ఫిబ్రవరి 6వ తేదీకి వాయిదా వేసింది.

# ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

జరిపారు. కాగా గతేడాది అక్టోబర్‌లో పాక్ పర్యటనకు వెళ్లిన సమయంలో పోలండ్ విదేశాంగ మంత్రి జమ్మూకశ్మీర్‌పై చేసిన సూచనలపై జైశంకర్ ఆయనకు చురకలు అంటించారు. ఉగ్రవాదాన్ని భారత్ ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉంటుందని.. భారత్‌తో స్నేహాన్ని కోరుకునే దేశాలు కూడా ఉగ్రవాదంపై మెతక వైఖరి వీడాలన్నారు. ఉగ్రవాదులు ఎప్పటికైనా ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. సరిహద్దు ఉగ్రవాదం వల్ల భారత్ ఎన్ని సమస్యలు ఎదుర్కొంటుందో రాడోస్లావ్‌కు తెలుసని జైశంకర్ అన్నారు. దానిని తగ్గించడానికి చర్యలు తీసుకోవాలే గానీ సరిహద్దుల్లో ఉగ్రవాదానికి ఆజ్యం పోయకూడదని చురకలు అంటించారు. ప్రపంచం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రత్యేకంగా భారత్‌ను మాత్రమే లక్ష్యం చేసుకోవడం అన్యాయమన్నారు. భారత్–పోలండ్ ద్వైపాక్షిక సంబంధాలపై మాట్లాడుతూ.. ఇరుదేశాల మధ్య సంబంధాలు స్థిరంగా ముందుకు సాగుతున్నాయన్నారు. అయినప్పటికీ వాటిని కాపాడుకోవడానికి నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. జైశంకర్ వ్యాఖ్యలపై రాడోస్లావ్ సికోర్స్కీ స్పందిస్తూ.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌తో కలిసి పని చేస్తామన్నారు. పోలండ్ కూడా ఉగ్ర సమస్యలను ఎదుర్కొంటుందని తెలిపారు. కాగా గతేడాది పోలండ్ విదేశాంగ మంత్రి రాడోస్లావ్ పాకిస్థాన్ పర్యటనకు వెళ్లిన సమయంలో అక్కడ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ఆ దేశ నేతలతో కలిసి ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.

# అరబ్ అధ్యక్షుడు షేక్ రాక

(మొదటి పేజీ తరువాయి)

ఒకే కారులో ప్రయాణించారు. అయితే, విదేశాంగ శాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం.. అల్ నహ్యాన్ కేవలం రెండు గంటలే దిల్లీలో ఉండనున్నట్లు తెలుస్తోంది. సోదరుడు, యూఏఈ అధ్యక్షుడు అల్ నహ్యాన్‌కు స్వాగతం పలికేందుకు విమానాశ్రయానికి వెళ్లాను. ఇరుదేశాల మధ్య స్నేహానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఈ పర్యటన చాటుతోంది‘ అని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ఇరు దేశాధినేతలూ చర్చలు జరపనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇంధన రంగాల్లో సహకారం తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. అల్ నహ్యాన్‌కు ప్రధాని మోదీ చెక్కతో కళాత్మకంగా రూపొందించిన ఓ పెద్ద ఊయలను కానుకగా ఇచ్చారు. దీన్ని గుజరాత్‌లో తయారు చేశారు. ఇద్దరు నేతలూ కలిసి కాసేపు ఆ ఊయలపై కూర్చుని సంభాషించుకున్నారు. అదేవిధంగా తెలంగాణలో తయారు చేసిన వెండి పె÷–టటెలో కశ్మీరీ పశ్మీనా శాలువాను బహుమతిగా ఇచ్చారు. అల్ నహ్యాన్ తల్లికి కూడా పశ్మీనా శాలువాతోపాటు కుంకుమ పువ్వు అందజేశారు. ఇరాన్– అమెరికా మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతినడం, యెమెన్ విషయంలో సౌదీ అరేబియా, యూఏఈల మధ్య ఉద్రిక్తతలు, గాజాలో రాజకీయ అస్థిరతలు నెలకొన్నవేళ ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. యూఏఈ అధ్యక్ష హోదాలో అల్ నహ్యాన్ భారత్‌లో అధికారికంగా పర్యటించడం ఇది మూడోసారి. 2022లో ఇరుదేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం అనంతరం సంబంధాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తోంది.

# బిజెపి నూతన అధ్యక్షుడుగా నితిన్ నబీన్

(మొదటి పేజీ తరువాయి)

స్వీకార కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను బీజేపీ నేతలు పరిశీలించారు. భారతీయ జనతా పార్టీకి కొత్త సారథి వచ్చారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ సిన్హా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా పదవీకాలం ముగియడంతో ఈ ఎన్నిక జరిగింది. మంగళవారం ఉదయం 11 గంటలకు ఆయన పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. బిహార్‌కు చెందిన 46 ఏళ్ల నితిన్ నబీన్ ను భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తూ గతేడాది డిసెంబరులో పార్టీ అనూహ్య ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఆయన్ను పార్టీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు అప్పుడే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. గతేడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపుర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బిహార్ నుంచి పార్టీలో అధ్యక్షుడి స్థాయికి చేరిన తొలి నేతగా నబీన్ గుర్తింపు పొందా రు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ ఎంపిక చేయడంతో పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటు ప్రధాని మంత్రివర్గంలోనూ భారీ మార్పులు ఉంటాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతు న్నారు. ఇదే సమయంలో 2029 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని.. 55ఏళ్ల లోపు వయ సున్న నేతలకు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించబోతున్నారనే ప్రచారం జరుగుతోంది.

# ఏడాదిన్నరలో రూ.23.5 లక్షల కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ప్రతినిధులు వచ్చారు. ఈ సమావేశం కూటమి ప్రభుత్వానికి అదృష్టం లాంటిది. ఏడాదిన్నరలో ఏపీకి రూ. 23.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా 16 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. అభివృద్ధి, ఐటీ, క్వాంటమ్ అంటూ ఏపీని సీఎం చంద్రబాబు ముందుకు నడిపిస్తున్నారు అని లోకేశ్ అన్నారు. అంతకుముందు మంత్రి నారా లోకేశ్ స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద ఆయనకు ఎన్ఆర్ఐ తెదేపా నేతలు, ప్రవాసాంధ్రులు ఘనస్వాగతం పలికారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు లోకేశ్ అక్కడి నుంచి దావోస్‌కు వెళ్లనున్నారు. ఏపీని నమ్మకమైన గ్లోబల్ గమ్యంగా నిలపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 90వ దశకంలోనే భారత్‌కు తొలి గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్లలో సీఎం చంద్రబాబు ఒకరని పేర్కొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు

(మొదటి పేజీ తరువాయి)

నాగేశ్వరరావు, ఖమ్మం–కొండా సురేఖ, మహబూబాబాద్ – పొన్నం ప్రభాకర్, మహబూబ్‌నగర్ – దామోదర రాజనరసింహ, జహీరాబాద్ – అజారుద్దీన్ మెదక్ – వివేక్ వెంకటస్వామి, నాగర్‌కర్నూల్ – వాకిటి శ్రీహరి, నల్గొండ – అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భువనగిరి – సీతక్క, వరంగల్ – పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పెద్దపల్లి – జూపల్లి కృష్ణారావులను నియమిచారు. తమ పరిధిలోని మున్సిపాలిటీల్లో గెలుపే లక్ష్యంగా వీరు కృషి చేయాల్సి ఉంటుంది.

# పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా చర్యలొద్దు

**తొలి అక్షరం/హైదరాబాద్,జనవరి19:** కాళేశ్వరం పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ వాయిదా పడింది. కాళేశ్వరంలో జరిగిన అక్రమాలు, అవినీతి ఆరోపణలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టును సవాలు చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ చీఫ్ సెక్రటరీ ఎస్‌కె జోషి, సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. కేసీఆర్, హరీష్ రావ్ తరఫున సుప్రీం కోర్టు సీనియర్ కౌన్సిల్ సుందరం వాదనలు వినిపించారు. ఈ కేసుపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కౌంటర్ దాఖలు చేసింది. ప్రభుత్వ కౌంటర్‌కు పిటిషనర్లు రిప్లై÷ల్ చేశారు. రిప్లైకు ప్రభుత్వం రిటన్ సబ్మిషన్ ఇచ్చేందుకు సమయం కావాలని హైకోర్టును అడ్వకేట్ జనరల్ కోరారు. ఫిబ్రవరి 20లోపు లిఖితపూర్వకమైన సబ్మిషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను ఫిబ్రవరి 25కు వాయిదా వేసింది. అప్పటి వరకు పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్ ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్పష్టం చేసింది.

# నిజాంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులే రేపటి రహదారి రక్షకులు









**● ట్రాఫిక్ నిబంధనలే ఆయుధంగాడ విద్యార్థులే రేపటి రక్షకులు ● విద్యార్థుల హృదయాలను తాకిన మియాపూర్ ట్రాఫిక్ ఎస్ఐ సత్యానందం సందేశం ● పాఠశాల ప్రాంగణమే అవగాహన వేదిక ● క్విజ్ పోటీలతో ఉత్సాహం.. బహుమతులతో ప్రోత్సాహం**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జనవరి 19:** రోడ్డు భద్రత అంటే పుస్తకాల్లోని పాఠం కాదని, అది ప్రతి మనిషి జీవితానికి సంబంధించిన బాధ్యత అని మరోసారి నిరూపితమైంది. నిజాంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం విద్యార్థుల్లో సరికొత్త ఆలోచనలకు బీజం వేసింది. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం పాఠశాల ప్రాంగణాన్ని సంపూర్ణంగా చైతన్య వేదికగా మార్చింది. **నియమాలు చెప్పిన నిమిషాలు.. జీవితానికి దిశ చూపిన క్షణాలు** రోడ్డు ప్రమాదాల వెనుక నిర్లక్ష్యమే ప్రధాన కారణమని, చిన్న తప్పిదం కూడా ప్రాణాంతకంగా మారుతుందని అధికారులు విద్యార్థులకు వివరించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని, క్రమశిక్షణే రహదారి భద్రతకు మూలమని స్పష్టంగా తెలిపారు.కేవలం ప్రసంగాలతో సరిపెట్టకుండా, విద్యార్థుల్లో ఎంత అవగాహన పెరిగిందో తెలుసుకునేందుకు 8వ, 9వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా క్విజ్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ అర్థాలు మైనర్ డ్రైవింగ్ ప్రమాదాలు హెల్మెట్, సీటు బెల్ట్ ప్రాముఖ్యత పాదచారుల భద్రతకు జీబ్రా క్రాసింగ్ అవసరం వంటి అంశాలపై ప్రశ్నలు సంధించగా, విద్యార్థులు చురుకుగా సమాధానాలు ఇచ్చి ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా మియాపూర్ ట్రాఫిక్ ఎస్ఐ సత్యానందం మాట్లాడుతూ,"ట్రాఫిక్ పోలీసులు చలానాలు వేయడానికి కాదుడ ప్రాణాలు కాపాడటానికి రోడ్లపై ఉంటారు. ఇంటి నుంచి బయల్దేరిన ప్రతి వ్యక్తి క్షేమంగా ఇంటికి చేరాలన్నదే మా లక్ష్యం. నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుత పౌరులు. మీ ఇంట్లో పెద్దలు హెల్మెట్ పెట్టుకోకపోయినా, అతివేగంగా వెళ్తున్నా వారిని నిలదీయగల శక్తి మీకుంది" అంటూ విద్యార్థుల్లో బాధ్యతా భావాన్ని నింపారు.**ప్రతిభకు గుర్తింపు** క్విజ్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఎస్ఐ సత్యానందం గారు స్వయంగా బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు, పాల్గొన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహక బహుమతులు అందించడంతో పాఠశాల ఆనందోత్సాహాలతో మారుమోగింది.ఈ కార్యక్రమం విద్యార్థులకే కాకుండా, వారి ద్వారా కుటుంబాలు, సమాజం మొత్తం ట్రాఫిక్ భద్రత వైపు అడుగులు వేస్తుందని పాఠశాల యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది. నిజాంపేట్ పాఠశాలలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమం ఇతర విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలిచింది.

## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 19:** రామన్నపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గరిక సత్యనారాయణ నివాస గృహంలో రామన్నపేట మండల భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుల సమక్షంలో ప్రజాపక్షం జాతీయ దినపత్రిక 2026వ సంవత్సర నూతన క్యాలెండర్ ను తన చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు ప్రభుత్వాలకు,ఇటు ప్రజలకు మధ్య వారధిగాఉండి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాలకు తెలియజేయడంలో ప్రజాపక్షం ముందంజలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ,ప్రజాపక్షం దినపత్రిక మండల రిపోర్ట్ సంగిశెట్టి పాండు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి కల్లెం రామచంద్రు,నాయకులు ఎర్ర రమేష్,పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి,ఏఐటియుసి మండల అధ్యక్షుడు శివరాత్రి సమ్మయ్య, రైతు సంఘం అధ్యక్షులు ఊట్కూరి కృష్ణ,ఏనూతుల రమేష్,ఊట్కూరి భగవంత,బాలగోని మల్లయ్య, గంగాపురం యాదయ్య,గంగాపురం వెంకటయ్య,వీరమల్ల ముత్తయ్య,సుదర్శన్,శంకర్,పెండెం రవీంద్ర,అందే పాండు,కడయ్య,అంజయ్య, నరసింహ చారి,యాదయ్య,గోరిగే శంకరయ్య,ఎర్ర బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా నూతన కలెక్టర్‌ను కలిసిన జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు




**తొలి అక్షరం/మాడుగులపల్లి/జనవరి: 19:** తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మేడి పాపయ్య ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు రామంజి సైదులు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి నూతన కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన బడుగు చంద్రశేఖర్ ను సోమవారం తన చాంబర్లో మర్యాదపూర్వకంగా భేటీ అయి పుష్పగుచ్చం అందించి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా దళిత, సామాజిక, వర్గాల సమస్యల పరిష్కారంలోను, కలెక్టర్ చొరవ చూపాలని ఈ సందర్భంగా విన్నవించుకున్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కంబాలపల్లి వెంకటయ్య, ఎమ్మార్పీఎస్ నల్గొండ నియోజకవర్గ ఇన్చార్జ్ పుల్లెంల ఏడుకొండలు మాదిగ, దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ పోతే సహదేవ్ మాదిగ, జిల్లా నాయకులు ఆరెకంటి ఏసయ్య, నూకపంగు శ్రీనివాస్, కొండేటి మధు, దేవరకొండ అధికార ప్రతినిధి అందుగుల సీతయ్య, దేవరకొండ సీనియర్ నాయకులు కొండపల్లి రమేష్, నల్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ అభివృద్ధికి మరో అడుగు

**● పరిగి రోడ్డు, పట్టణ కూడలి అభివృద్ధి పనులకు శ్రీకారం ● రూ.5.54 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం ● బాధితులకు న్యాయం చేస్తాం.. అందరికీ ఆమోదయోగ్యంగా విస్తరణ**






**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి19:** షాద్‌నగర్ పట్టణ అభివృద్ధిలో కీలకమైన ముందడుగుగా పరిగి రోడ్డుతో పాటు పట్టణ కూడలి విస్తరణ పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని పరిగి రోడ్డుపై రూ.5.54 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధి విస్తరణ ద్వారానే సాధ్యమవుతుందని, అందుకే రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామని అన్నారు. పరిగి రోడ్డుపై 10 అడుగుల విస్తరణతో పాటు పట్టణ కూడలిని మరింత విస్తృతంగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు.విస్తరణలో కొంతమందికి నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొంటూ... బాధితులకు న్యాయమైన పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని భరోసా ఇచ్చారు.పట్టణ కూడలి అభివృద్ధి విషయంలో నియంత్రిత ధోరణి ప్రదర్శించకుండా, అందరికీ ఆమోదయోగ్యంగా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ అభివృద్ధి ప్రక్రియకు మున్సిపాలిటీ ప్రజలు, ప్రజాప్రతినిధులు, ముఖ్యంగా వ్యాపారులు సహకరించాలని కోరారు.మాటల్లో కాదు.. చేతల్లోనే ప్రగతిని చూపిస్తున్నామని పేర్కొన్న ఎమ్మెల్యే, అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో మున్సిపాలిటీలో ఒక్క పని కూడా ఆగలేదన్నారు.కాంట్రాక్టర్ల కారణంగా కొన్ని పనులు ఆలస్యమైనా, అన్ని పనులు వేగవంతంగా పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేయడమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నేతలు అగునూరు విశ్వం, కాశీనాథ్ రెడ్డి, జమ్రుద్ ఖాన్, అగునూరు బస్వం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**తొలి అక్షరం/మేడిపల్లి/జనవరి 19:** మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రిషబ్ శర్మ (26) అనే యువకుడు మృతి చెందాడు. సీ ఐ గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ ప్రాంతంలో ఉన్న ఆర్కిడ్ ఇంటర్నెషనల్ స్కూల్లో సేల్స్ మేనేజర్ గా పనిచేస్తున్న రిషబ్ శర్మ ఆదివారం మధ్యాహ్నం ఉప్పల్ నుంచి ఘట్కేసర్ వైపు తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో చెంగిచెర్ల చౌరస్తా సమీపంలో ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో రిషబ్ శర్మకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారంతో అతన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు కానీ గాయాల తీవ్రత ఎక్కువగా ఉండడంతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకోవడంతో పాటు టాంకర్ డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిపారు.

## అంబేద్కర్ ఆశీస్సులతో ముందుకు సాగుతా...





**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 19:** భారత రాజ్యాంగ స్ఫూర్తితో దేశ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ వెల్లంకి గ్రామ శాఖ అధ్యక్షుడు నకేరకంటి మహేష్ అన్నారు. గ్రామ అధ్యక్షుడిగా నియమితులైన వేళ గ్రామంలో డా.దీ=.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయనను కుల పెద్దలు అభినందించారు. డా.అశోక్, మాజీ సర్పంచ్ వెంకట్ రావు, శ్రీను, ఎర్రోళ్ల నరసింహ, జుంపాల మల్లేష్, తలారి నరసింహ, రాజు, కిరణ్, సురేష్, లింగయ్య, యాదయ్య ఉన్నారు.

## రామన్నపేట సీఐ ఎస్సైని సన్మానించిన కోళ్ల రామకృష్ణ సర్పంచ్ ఉత్తటూరు





**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 19:** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఉత్త టూర్ గ్రామం నుంచి సర్పంచ్ గా ఎన్నికైన కోళ్ల రామకృష్ణ రామన్నపేట సిఐ ఎన్. వెంకటేశ్వర్లు రామన్నపేట ఎస్సై డి నాగరాజు లను మర్యాదపూర్వకంగా కలిసి వారిని సన్మానించినారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి టీపీసీసీ అధికార ప్రతినిధి మేడి రవిచంద్ర పాల సంఘం చైర్మన్ తదితరులు పాల్గొన్నారు

## టిఆర్ఎస్ అభ్యర్థులు గెలిపే లక్ష్యంగా పనిచేయాలి

**- చిరుమర్తి లింగయ్య మాజీ ఎమ్మెల్యే**

**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 18:** మల్లారెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగిన బి ఆర్ ఎస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరవ వార్డ్ ఇంచార్జి ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, బి ఆర్ ఎస్ మండల నాయకులు రాస వెంకటేశం, గ్రామ కార్యదర్శి రవ్వనర్సింహా పాల్గొన్నారు.



# నూతన సర్పంచ్‌లకు ఘన సన్మానం

• అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీడీఓ పిలుపు



**తొలి అక్షరం/మాడుగులపల్లి/ జనవరి 19:** మాడుగులపల్లి మండల పరిధిలోని నూతనంగా ఎన్నికైన అన్ని గ్రామ సర్పంచ్‌లకు సోమవారం మండల కేంద్రంలోని వివిఎస్ గార్డెన్లో ఘన సన్మానం జరిగింది. ఎంపీడీఓ వంశీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లకు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల పురోభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని కోరారు. సర్పంచ్‌లు అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు. ఈ యొక్క కార్యక్రమానికి ఏ ఒక్క మండల స్థాయి అధికారులకు పత్రిక విలేకరులకు గాని సమాచారం లేకపోవడం శోచనీయం.

# స్కైలాబ్ బాబును పరామర్శించిన సిపిఎం నాయకులు



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 19:** కుల వివక్షత పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్ బాబును సిపిఎం పార్టీ నాయకులు పరామర్శించారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు చిన్న ఆరోగ్య సమస్య తో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న ఆయనను సోమవారం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న , శెట్టి వెంకన్న , కురవి మండల నాయకులు నల్లపు సుధాకర్ , మాజీ వార్డు కౌన్సిలర్ శాగంటి భాగ్యమ్మ , కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చీపిరి యాకయ్య , రామ్మూర్తి , నేరడ సిపిఎం నాయకులు, చాగంటి వీరన్న , దైద సురేందర్ , నూనె శ్రీనివాస్ , తదితరులు వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని త్వరగా కోలుకొని ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు.

# గ్రామ సభలో కాంగ్రెస్ నాయకులు గ్రామస్తుల నిరసన..



**తొలి అక్షరం/కరీంనగర్ జిల్లా జనవరి 19:** కరీంనగర్ జిల్లా నగునూరు గ్రామానికి సంబంధించిన జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు గ్రామ సభ వద్ద నిరసన చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమం నేడు మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సాయిల్ల రాజు ఆధ్వర్యంలో జరిగింది. నగునూరు గ్రామానికి సంబంధించిన ఉపాధి హామీ నిధులను మాజీ కార్పొరేటర్ దుర్వినియోగం చేశారని, ఇందుకు సహకరించిన సంబంధిత అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దుర్వినియోగమైన నిధులను రికవరీ చేసి గ్రామ అభివృద్ధికి కేటాయించాలని నిరసనకారులు కోరారు. గ్రామ శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్, మండల ప్రధాన కార్యదర్శి కొత్తకొండ కొమరయ్య, మండల్ సెక్రటరీ తాండ లక్ష్మణ్, గజ్జల మహేష్, ఎండి షఫీ, కృష్ణారెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు మరియు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.

# 3టీ టీవీ న్యూస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన షాద్ నగర్ ఫ్యూచర్ జోన్ డీసీపీ శిరీష

• ప్రజా సమస్యలకు గొంతుకగా 3టీ టీవీ. ఎసిపి లక్ష్మీనారాయణ



**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 19:** షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ 3టి టీవీ రిపోర్టర్ వానరాశి జగన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను షాద్ నగర్ ఫ్యూచర్ జోన్ డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ విజయ్ కుమార్‌లు ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డీసీపీ శిరీష మాట్లాడుతూ3టి టీవీ ప్రజా సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చే వేదికగా నిలుస్తోందని అన్నారు.గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ స్థాయి వరకు జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలును ప్రజలకు చేరవేయడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.3టి టీవీ ఇలాంటి బాధ్యతాయుత పాత్రను కొనసాగించడం అభినందనీయమన్నారు.ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖతో పాటు మీడియా కూడా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాల్లో 3టి టీవీ ముందుండటం సంతోషకరమన్నారు.పట్టణ సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూసత్యనిష్ఠమైన వార్తలతో ప్రజల్లో నమ్మకం సంపాదించుకోవడమే నిజమైన జర్నలిజమని అన్నారు.త్రీటి టీవీ అదే బాటలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో 3టి టీవీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. నూతన సంవత్సరంలో 3టి టీవీ మరింత ప్రగతిపథంలో సాగాలని అందరూ శుభాకాంక్షలు తెలిపారు.

# పాలకుర్తి ఎమ్మెల్యేనీ కలిసిన మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



**తొలి అక్షరం/పాలకుర్తి జనవరి 19:** మహబూబాబాద్ జిల్లా నూతన వ్యవసాయ శాఖ అధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి శాసన సభ్యురాలు శ్రీమతి యశస్విని రెడ్డి గారిని జిల్లా వ్యవసాయ అధికారి సరిత మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ భేటీలో ఆమె వెంట తొర్రూరు వ్యవసాయ శాఖ అధికారి నర్సయ్య , పెద్దవంగర వ్యవసాయ శాఖ అధికారి స్వామి తో పాటు ఇతర వ్యవసాయ శాఖ సిబ్బంది కూడా హాజరయ్యారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారు మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా సహా అన్ని ఎరువులు సమయానికి, సరిపడా అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారులను కోరారు. ముఖ్యంగా రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, ఎరువుల కొరత, ఆలస్యం వంటి సమస్యలు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పటిష్టమైన పర్యవేక్షణ ఉండాలని సూచించారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా వ్యవసాయ శాఖ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. అలాగే రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, పంటల సాగు మార్గదర్శకాలు అందిస్తూ వారి ఆదాయం పెరిగేలా వ్యవసాయ శాఖ కీలక పాత్ర పోషించాలని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు.ఈ సమావేశం సానుకూల వాతావరణంలో సాగగా, జిల్లా వ్యవసాయ అధికారి సరిత గారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గారికి హామీ ఇచ్చారు.

# అంగన్వాడీల బలోపేతానికి ప్రభుత్వం కృషి

• పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 19:** అంగన్వాడి కేంద్రాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం తొర్రూర్ పట్టణంలోని 3వ అంగన్వాడి సెంటర్ లో చిన్నారులకు యూనిఫామ్ ను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.చిన్నారుల విద్యా, ఆరోగ్య అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, చిన్నారులకు అవసరమైన మౌలిక వసతులు, పోషకాహారం,విద్యా సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.యూనిఫామ్ పంపిణీ ద్వారా పిల్లల్లో చదువుపై ఆసక్తి పెరిగి,సమానత్వ భావన బలపడుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, సిడిపిఓ కమలాదేవి,ఏసిడిపిఓలు విజయలక్ష్మి,సంకీర్తన, సూపర్వైజర్లు మల్లీశ్వరి, శ్రీదేవి, శోభ,ఉష రాణి, గౌసియా,నాగమణి, సునీత, విజయ, సరిత,అంగన్వాడి టీచర్ ప్రమీల,ఆయా తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌ల సన్మానం దేనికి... అంత అవసరమా అంటున్నా మండల ప్రజానీకం...

• కాసుల కోసమే నా అని మండల ప్రజల మండిపాటు



**తొలి అక్షరం/మాడ్గులపల్లి/జనవరి:19:** సర్పంచుల సన్మానం దేనికని ముక్కున వేలేసుకుంటున్న మండల ప్రజానీకం. దొంగలు పడ్డ ఆరు నెలలకు అన్న చందంగా సోమవారం మండల కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హల్ లో స్థానిక మండల అధికారి హుటాహుటిన కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల వివిధ రకాలుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇట్టి కార్యక్రమానికి మరో స్థాయి మండల స్థాయి అధికారులు ఎవరిని ఆహ్వానించకుండా తానే ఏకపక్షంగా నిర్వహించడం సబబు కాదని వివిధ మండల స్థాయి సంబంధిత అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని మండల ప్రజల వినికిడి. నాకు మించిన అధికారి మండలంలో లేరంటూ అహం వ్యక్తం చేస్తున్నారని వివిధ అధికారుల ఆగ్రహం. నేరుగా పరీక్ష రాసి ఉన్నతమైన స్థానంలో ఉన్నాననే కోణంలో ఆ అధికారి ఉన్నట్లు సమాచారం. సర్పంచుల సన్మానం కార్యక్రమం నిర్వహించిన ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో మాడ్గులపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి దశ దిన కర్మ కార్యక్రమం ఉన్నప్పటికీ అధికారిని అనే అహంకారంతో కార్యక్రమానికి ఇబ్బంది గా మారారు అని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏదేమైనా ఆ అధికారి వచ్చినప్పటి నుండి మిగతా అధికారులపై అహం జులుం ప్రవర్తిస్తున్నాడని ఆరోపణ లు వ్యక్తమవుతున్నాయి. కాసుల కోసమే ఈ కార్యక్రమం నిర్వించారని మండల ప్రజలు మండి పడుతున్నారు.

# ప్రజలకు మెరుగైన సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ దేయం

• రూ 9.52 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మురళీ నాయక్ ,డీసీసీ అధ్యక్షురాలు ఉమా నాయక్ శంకుస్థాపన





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జనవరి 19:** ప్రజలకు మెరుగైన సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ దేహమని శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్ తెలిపారు. సోమవారం పురపాలక సంఘ పరిధిలోని పలు వార్డుల్లో రూ.. 9.50 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు వైద్యులు మురళీ నాయక్ మాట్లాడుతూ మానుకోట పురపాలక సంఘాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ, కేటాయించిన ప్రతి రూపాయిని ప్రజల మేలు కోసం వినియోగిస్తామని హామీ ఇచ్చారు.గత 10 ఏండ్ల లలో టిఆర్ఎస్ పాలకులు అంతర్గత రోడ్డు,మురుగు నీటి కాలువలను నిర్మించలేదని విమర్శించారు,బీఆర్ ఎస్ పార్టీని ను ప్రజలు నమ్మే పరిస్థితి లో లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ మాజీ చైర్ పర్సన్ భూక్య ఉమా మురళి నాయక్, పురపాలక సంఘ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

• తొర్రూరు ఏరియా ఆసుపత్రి సూపరిటెండెంట్ సుగుణాకర్ రాజు




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 19:** ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తొర్రూరు ఏరియా ఆసుపత్రి సూపరిటెండెంట్ సుగుణాకర్ రాజు తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 45 మంది గర్భిణీలకు ప్రోటీన్ పౌడర్, మల్టీ విటమిన్ సిరప్ లు,150 మంది రోగులకు అల్పాహారం అందజేశారు.లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రామ్ నరసయ్య తో కలిసి డాక్టర్ సుగుణాకర్ రాజు మాట్లాడారు.దైనందిన జీవితంలో వ్యాయామం భాగం చేసుకోవాలని సూచించారు.సమయానికి నిద్రపోవాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు.గర్భిణీ స్త్రీలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన బిడ్డ జన్మించాలంటే మంచి పౌష్టికాహారం తీసుకోవడం అవసరమన్నారు.లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు.ఈకార్యక్రమంలో క్లబ్ సెక్రెటరీ ముదుపు రవీందర్ రెడ్డి, క్లబ్ ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్, క్లబ్ జాయింట్ సెక్రెటరీ బోనగిరి శంకర్,మెడికల్ ఆఫీసర్ డాక్టర్లు నందన దేవి, డాక్టర్ మిరాజ్, డాక్టర్ మానస తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి సంబరాలు

## స్వయం సహాయక సంఘం గ్రూపులకు వడ్డీ లేని రుణాల పంపిణీ


## డ్వాక్రా గ్రూపులకు రుణాల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 19:** తొర్రూరు పట్టణంలోని బిఆర్ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ ప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా మరియు తొర్రూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల సబ్సిడీ పంపిణీ కార్యక్రమంలో పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే




యశస్విని రెడ్డి మాట్లాడుతూ.మహిళల ఆర్థిక సాధికారతే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు స్వయం ఉపాధి సాధించి కుటుంబాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు, సబ్సిడీలు అందిస్తూ వారి జీవితాల్లో భరోసా కల్పిస్తున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా తొర్రూరు పట్టణానికి చెందిన 114 స్వయం సహాయక సంఘాలకు రూ.22,30,982/- విలువైన వడ్డీ లేని రుణాల చెక్కులను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి లబ్ధిదారులైన మహిళలకు అందజేశారు. ఈ రుణాలను ఉపయోగించి మహిళలు చిన్న వ్యాపారాలు, ఉపాధి కార్యక్రమాలు ప్రారంభించి ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు.అలాగే మహిళలు సంఘటితంగా పనిచేస్తే అభివృద్ధి సాధ్యమని, స్వయం సహాయక సంఘాలు సామాజిక మార్పుకు శక్తివంతమైన వేదికలని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మహిళలను కోరారు..ఈ కార్యక్రమంలో జిల్లా డిఆర్డిపి, మున్సిపల్ కమిషనర్ వక్కాల శ్యాంసుందర్,,తాసిల్దార్ జి శ్రీనివాసరావు,ఎంపీడీఓ వెంకటేశ్వర్లు,మెప్మా అధికారులు, తొర్రూరు పురపాలక సంఘ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల నాయకులు,మహిళలు పాల్గొన్నారు

# సీఎం కప్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్




**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో, జనవరి 19:** సీఎం కప్ క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణపై అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించడమే సీఎం కప్ క్రీడా పోటీల ప్రధాన లక్ష్యమని తెలిపారు. సీఎం కప్ క్రీడా పోటీలు ఐదు దశలుగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.గ్రామ పంచాయతీ స్థాయి పోటీలు ఈ నెల 17 నుండి 22 వరకు, మండల స్థాయి పోటీలు ఈ నెల 28 నుండి 31 వరకు, నియోజకవర్గ స్థాయి పోటీలు ఫిబ్రవరి 3 నుండి 5 వరకు, జిల్లా స్థాయి పోటీలు ఫిబ్రవరి 9 నుండి 12 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నాలుగు దశల పోటీల్లో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొనే అర్హత పొందుతారని చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఫిబ్రవరి 20 నుండి 23 వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు వివరించారు.గ్రామస్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణ కోసం జిల్లాను క్లస్టర్లుగా



విభజించినట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలో కబడ్డీ, వాలీబాల్, ఖో–ఖో క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పోటీలు సక్రమంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములుగా చేసుకుని క్రీడలను విజయవంతం చేయాలని సూచించారు.నియోజకవర్గ స్థాయిలో వాలీబాల్, ఖో–ఖో, కబడ్డీ క్రీడలతో పాటు ఫుట్‌బాల్ పోటీలను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లా స్థాయిలో వివిధ రకాలైన మొత్తం 31 క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.గ్రామీణ ప్రాంతాలలో సీఎం కప్ క్రీడా పోటీలపై విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలని, క్రీడల్లో పాల్గొనదలచిన వారు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునేలా అవసరమైన అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు తమ వివరాలను అధికారిక వెబ్‌సైట్ (satg.telangana.gov.in/cmcup) లేదా 'జవీ జబజూ' మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పాల్గొనే ప్రతి క్రీడాకారుడికి ప్రభుత్వం సర్టిఫికేట్లు అందజేస్తుందని అన్నారు.గ్రామ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు మండల స్థాయికి, మండల స్థాయి నుంచి గెలుపొందిన వారు నియోజకవర్గ స్థాయికి, అక్కడి నుంచి జిల్లా స్థాయికి, అనంతరం రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు . సీఎం కప్ క్రీడా పోటీల్లో విద్యార్థులు, యువకులతో పాటు అన్ని వయసుల క్రీడాకారులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని క్రీడాప్రియులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిఎంహెచ్వో రవి రాథోడ్, జిల్లా క్రీడల అధికారిని డాక్టర్ జ్యోతి, మహబూబాబాద్ ఆర్డిఓ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలి: సదర్ శీను

- బీసీల విజయం కోసం లక్ష్మీనరసింహస్వామిని దర్శించిన సదర్ శీను యాదవ్
- గెలుపే లక్ష్యంగా బీసీలు ముందుకు సైన్యంల కదలాలి: సదర్ శీను పిలుపు



**తొలి అక్షరం/షాద్ నగర్,జనవరి 19:** షాద్‌నగర్ పట్టణ కేంద్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు చారిత్రాత్మక అవకాశం వచ్చిందని,ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని చైర్మన్ పదవిని దక్కించుకుని రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని షాద్‌నగర్ బీసీ సేనా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సదర్ శీను యాదవ్ పిలుపునిచ్చారు.ఈ లక్ష్య సాధన కోసం యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు వచ్చిన ఈ అవకాశాన్ని వృథా చేసుకోకుండా, ఐక్యతతో ముందుకు సాగాలి. బీసీ వర్గాలు రాజకీయంగా మరింత బలోపేతం కావాలంటే స్థానిక సంస్థల నుంచే నాయకత్వం ఎదగాలి.షాద్‌నగర్‌లో బీసీలకు చైర్మన్ పదవి సాధ్యమయ్యేలా అందరం కలిసికట్టుగా కృషి చేయాలని పేర్కొన్నారు.అలాగే, బీసీల ఐక్యతను చాటేలా ఎన్నికల్లో భారీ సంఖ్యలో సీట్లు గెలుచుకోవాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి బీసీ నాయకత్వం ముందుండాలని ఆకాంక్షించారు.బీసీలు రాజకీయంగా ఎదగాల్సిన సమయం ఆసన్నమైందని, ఈ ఎన్నికలు భవిష్యత్‌కు దిశానిర్దేశం చేస్తాయని సదర్ శీను అభిప్రాయపడ్డారు.ఈ లక్ష్యంతోనే లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని, బీసీలకు విజయం చేకూర్చాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

# ఎండి బషీర్‌కు శుభాకాంక్షలు తెలిపి సన్మానించిన తిరుపతిరెడ్డి





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జనవరి 19:** తొర్రూరు మండలంలోని చెర్లపాలెం గ్రామంలో ఆదివారం ఆ గ్రామ మైనారిటీ సెల్ కమిటీని మైనారిటీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎం.డి. బషీర్ ఎన్నికైన సందర్భంగా తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి ఎండి బషీర్ కు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా శాలువాతో సన్మానించారు. అనంతరం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ. గ్రామస్థాయిలో మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి సంఘం బలోపేతానికి కృషి చేయాలని అలాగే ప్రభుత్వ నుండి వచ్చిన సంక్షేమ పథకాలను మైనారిటీలకు అందే విధంగా కృషి చేయాలని సూచించారు.గ్రామ సర్పంచ్ ధర్మారపు మహేందర్,ఉప సర్పంచ్ జినుగ రవిరెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగిరెడ్డి,వార్డు సభ్యులు, మాజీ వార్డు సభ్యులు,మాజీ ఉప సర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు,సోషల్ మీడియా ఇన్చార్జలు మరియు గ్రామ ప్రజలు పాల్గొని బషీర్ కు శుభాకాంక్షలు తెలియజేసి గ్రామాభివృద్ధికి అలాగే వారి సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరుకున్నారు.

## బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడి కుమారుడిని ఆశీర్వాదించిన హరీష్ రావు ముఖ్య అనుచరుడు




**తొలి అక్షరం/ఏన్కూర్ జనవరి 19:** ఏన్కూర్ మండలం బీఆర్ఎస్ పార్టీ మండల విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు గుగులోత్ మజీలాల్ కుమారుడు ప్రతీక్ మొదటి జన్మదిన వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ నేత, మాజీ మంత్రి వర్యులు తన్నీరు హరిష్ రావు గారి ముఖ్య అనుచరుడు, ఏన్కూర్ మండల నాయకులు భుక్యా వినోద్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వాదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక మండల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎ1 బిర్యానీ మెస్ & మండి ప్రారంభోత్సవంలో పాల్గొన్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి





**తొలి అక్షరం/పాలకుర్తి జనవరి 19:** పాలకుర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తా సమీపంలో అంగోత్ శ్రీనివాస్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎ1 సెంట్రల్ బిర్యానీ మెస్ & మండి బిర్యానీ సెంటర్ను కు ముఖ్య అతిథిగా విచ్చేసి, ఘనంగా ప్రారంభోత్సవం చేసిన పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ యజమానులు మరియు సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త వ్యాపారాలు పట్టణ అభివృద్ధికి తోడ్పడతాయని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని వారు పేర్కొన్నారు. ప్రజలకు రుచికరమైన, నాణ్యమైన ఆహారం అందిస్తూ వ్యాపారం విజయవంతం కావాలని ఆకాంక్షించారు..ఈ ప్రారంభోత్సవంలో బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, సీనియర్ నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు, పట్టణ అధ్యక్షులు నాగన్న, స్థానిక నాయకులు, వ్యాపారులు, వివిధ గ్రామ సర్పంచులు, పార్టీ కార్యకర్తలు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రామన్నపేట సిఐ ఎన్. వెంకటేశ్వర్లు



**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 19:** రామన్నపేట ట్రావెల్స్ యజమానులకు,వాహనదారులకు రామన్నపేట లో రోడ్ సెఫ్టి గురించి అవగాహనా కార్యక్రమంను సీఐ ఎన్ వెంకటేశ్వర్లు రామన్నపేట, ఎస్సై నాగరాజు నిర్వహించడం జరిగింది. ఇట్టి అవగాహనా కార్యక్రమం లో ప్రజలు రోడ్డు ప్రయాణం చేసేటప్పుడు సీటు బెల్ట్ ధరించాలి అని తప్పకుండ హేల్మంట్ దరించి ఉండాలని అదే విదంగా డ్రైవింగ్ లైసెన్స్, ఆర్ సి మరియు ఇన్సురెన్స్ తప్పకుండ ఉండాలని ప్రజలకు తెలియజేసినారు, మొబైల్ ఫోన్ ఫోన్ మాట్లాడుతూ మరియు మద్యం త్రాగి వాహనాలను నడపకుడదని తెలియజేసినారు, రోడ్డు ప్రమాదం వలన ఎంతో మంది వికలాంగులుగా మారి మరియు ప్రాణాలు కోల్పోయారని తెలియజేసినారు. ఇట్లు డి నాగరాజు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రామన్నపేట మండలం

# స్వచ్ఛ మేడారానికి అందరం సహకరిద్దాం

**● ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి**

**● మేడారం జాతరను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దుదాం ● 22 భాషల్లో అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ**





**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జనవరి19:** పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా దేశవ్యాప్తంగా విశేష సేవలందిస్తున్న 'ప్రపంచ పర్యావరణ సంస్థ' (వరల్డ్ ఎన్విరాన్మెంట్ ఆర్గనైజేషన్) చేపట్టిన 'స్వచ్ఛ మేడారం' కార్యక్రమాన్ని ప్రముఖ ఐఏఎస్ అధికారి, 'స్వచ్ఛ ఇండోర్' రూపశిల్పి పరికిపండ్ల నరహరి అభినందించారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగైన మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరను ఈ నెల జనవరి 28 నుంచి 31 వరకు పురస్కరించుకుని భక్తుల్లో అవగాహన కల్పించేందుకు 22 భారతీయ భాషల్లో రూపొందించిన ప్రత్యేక పోస్టర్లు, క్లాత్ బ్యానర్లను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి.నరహరి మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ కోసం గత 14 ఏళ్లుగా ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న కృషి అమోఘమని కొనియాడారు.ఇండోర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో ప్రజా భాగస్వామ్యంతో ఆ నగరాన్ని వరుసగా ఎనిమిది సార్లు దేశంలోనే అత్యంత స్వచ్ఛ నగరంగా నిలిపాం.అదే స్ఫూర్తితో నేడు మేడారం జాతరను కూడా ప్లాస్టిక్ రహితంగా, కాలుష్య రహితంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అని ఆయన పిలుపునిచ్చారు.**22 భాషల్లో ప్రచారం:** దేశం నలుమూలల నుండి వచ్చే భక్తులకు అర్థమయ్యేలా 22 భాషల్లో అవగాహన పోస్టర్ల రూపకల్పన.**ప్లాస్టిక్ రహిత జాతర:** పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల స్థానంలో లక్షలాది జ్యూట్ (జనపనార) బ్యాగుల పంపిణీ. **విద్యార్థుల భాగస్వామ్యం:** 'ప్రకృతి ఉపాధ్యాయుడు – ప్రకృతి మా భవిష్యత్తు' నినాదంతో పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ అవగాహన. **ప్రకృతిని కాపాడటమే మా లక్ష్యం: డాక్టర్ సిహెచ్. భద్ర** సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సిహెచ్. భద్ర మాట్లాడుతూ, గత 14 ఏళ్లుగా 'సేవ్ మేడారం – క్లీన్ మేడారం' పేరుతో చేస్తున్న కార్యక్రమాలను రాష్ట్ర మంత్రి సీతక్క అభినందించడం తమకు మరింత ఉత్సాహాన్నిచ్చిందని తెలిపారు.తెలంగాణవ్యాప్తంగా వందలాది ర్యాలీలు నిర్వహించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించినట్లు జాతీయ యువజన కార్యదర్శి సుమెర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి,కోశాధికారి ఎండి. రెజ్వన్, డాక్టర్ ఏ. జోత్స్నారావు, సిహెచ్. సాగర్, కలయిక ఫౌండేషన్ చైర్మన్ చీరాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అసౌకర్యాల నుండే ఆవిష్కరణలు ఉద్భవిస్తాయి

**● సమాజాన్ని పట్టిపీడిస్తున్న ఏదైనా సమస్యకు పరిష్కారం చూపడమే నిజమైన ఆవిష్కరణ**

**● గాయం అశ్విన్ రెడ్డి లోకస్ ఎలైట్ వ్యవస్థాపకులు,సీఈవో**





**తొలి అక్షరం/వరంగల్ :జనవరి19:** ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి ఆహ్వానం మేరకు శిఖర స్కిల్ సెంటర్ సందర్శించిన ప్రముఖ అంతర్జాతీయ సాఫ్ట్వేర్ సంస్థ లోకస్ ఎలైట్ (LOCUS ELITE) సంస్థ వ్యవస్థాపకులు,సీఈవో గాయం అశ్విన్ రెడ్డి.ఈ సందర్భంగా ఇండస్ ఫౌండేషన్ చైర్మన్,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ..ప్రతీ మనిషిలో ఏదో ఒక నైపుణ్యం ఉన్నప్పుడే ఉపాధి,ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.ఒక ఇంట్లో ఒక ఆడబిడ్డ ఒక నైపుణ్యాన్ని కలిగి ఉంటే తన కాళ్ళమీద తాను నిలబడటమే కాకుండా మొత్తం కుటుంబాన్నే నిలబెడుతుందని అన్నారు.ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హన్మకొండ,వందఫీట్ల రోడ్డు జవహర్ కాలనీ లో నిర్వహిస్తున్న శిఖర స్కిల్ సెంటర్ ను సందర్శించడానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు,ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి ఆహ్వానం మేరకు ప్రముఖ అంతర్జాతీయ సాఫ్ట్వేర్ సంస్థ లోకస్ ఎలైట్ (LOCUS ELITE) సంస్థ వ్యవస్థాపకులు,సీఈవో గాయం అశ్విన్ రెడ్డి శిఖర స్కిల్ సెంటర్ సందర్శించారు.ఈ సందర్భంగా శిఖర స్కిల్ సెంటర్ లో కుట్టు మిషన్,మగ్గం,బ్యూటీషన్ లో శిక్షణ పొందుతున్న శిక్షార్థులను ఉద్దేశించి అశ్విన్ రెడ్డి మాట్లాడారు.వ్యాపారంలో అనుసరించాల్సిన మెళుకువల పై, వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవడం సద్వినియోగం చేసుకోవడం పై అనేక ఆలోచనలు మహిళలతో పంచుకోవడం జరిగింది.తాను బిట్స్ పిలానీలో చదువుతున్న రోజుల్లో కలిగిన ఆలోచనలతో తన 24 ఏళ్ల వయస్సులో సంస్థను నెలకొల్పిన తీరు,ఎదుర్కొన్న సమస్యలపై సందేశం ఇచ్చారు.తన మిత్రుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఒక గొప్ప సంకల్పంతో మహిళలను వ్యాపారవేత్తలుగా, నైపుణ్యం గల వ్యక్తులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న తీరు నేరుగా చూడాలన్న తపనతో వరంగల్ కు రావడం జరిగిందని ఈ సందర్భంగా తెలిపారు.ఈ శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాన్ని అనునిత్యం సాధన చెయ్యాలని, ఆ పని ద్వారా ఉపాధి కల్పించుకునే దిశగా అడుగులు వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రవి నాయక్,శిఖర స్కిల్ సెంటర్ నిర్వాహకులు జ్యోతి,గువ్వ రాజేష్,కార్తీక్ రెడ్డి,ఇండస్ ఫౌండేషన్ సభ్యులు పురుషోత్తం యాదవ్,అఖిల్ రెడ్డి,సుమన్ గౌడ్,హరీష్,రమేష్,అనిల్,భాస్కర్,యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేటలో దళితులకు గుర్తింపు ఎక్కడ?



**● దళిత లీడర్లను గుర్తించని దళిత ఎమ్మెల్యేలు!**





**తొలి అక్షరం/రామన్నపేట జనవరి 19:** రామన్నపేట మండలం ఒకప్పుడు నియోజకవర్గ కేంద్రంగా ఒక వెలుగు వెలిగిన చరిత్ర కలిగిన ప్రాంతం ఇక్కడ ఎంతోమంది గొప్ప ఎమ్మెల్యేలు 1952 నుంచి 2009 వరకు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారు ఈ ప్రాంతంలో అభివృద్ధి జరిగింది అంటే అది కేవలం రామన్నపేట నియోజకవర్గం పైన ఉన్న అభిమానంతో మాత్రమే కొమ్ము పాపయ్య గుర్రం యాదగిరి రెడ్డి ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన వారిలో మొదటి స్థానంలో ఉంటారు రామన్నపేట మండలానికి డిగ్రీ కాలేజీ 1990 ప్రాంతంలో తీసుకువచ్చిన చరిత్ర ఈ ప్రాంతానికి కావలసిన అన్ని రకాల ఏఈ నుంచి మొదలు డి ఈ ఆఫీస్ వరకు అన్ని శాఖల అధికారులను నియోజకవర్గ కేంద్రంలో ఉండాలని పట్టు పట్టి చెప్పించి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన ఘనత వీరికి దక్కుతుంది ముఖ్యంగా ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి గుర్రం యాదగిరి రెడ్డి ఈ ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజాప్రతినిధులను ప్రోత్సహిస్తూ దళిత సామాజిక వర్గానికి పెద్ద పీట వేసినారు ఎంతోమంది దళిత లీడర్లను వారి కాలంలో తయారు చేసినారు వారి కాలంలో దళిత సామాజిక వర్గం నుంచి 14 సంవత్సరాల సర్పంచిగా రామన్నపేట జెడ్పిటిసి గా నోముల. మారయ్య లాంటి లీడర్లను తయారు చేసినారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా నియోజక వర్గంగా ఉన్న రామన్నపేట కాస్త మండల కేంద్రంగా మారి అందులో నకిరేకల్ నియోజకవర్గంలో కలవడం అభివృద్ధికి ఆమడ దూరంలోపోవడానికి ప్రధాన కారణం అయింది 2009 నుంచి 2026 వరకు ఈ ప్రాంతంలో దళిత ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న వారు మాత్రం అభివృద్ధి చెందారు తప్ప రెండవ స్థానంలో ఒక్క దళిత లీడర్ ను తయారు చేయడంలో వీరు పూర్తిగా విఫలమైనారు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసిన ఒకానొక సమయంలో తెలంగాణ వస్తదా రాదా అన్న సందర్భంలో టిఆర్ఎస్ పార్టీని తన భుజాల పైన వేసుకొని మూడుసార్లు టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షునిగా పని చేసినారు అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి బెదిరింపులకు గురిచేసిన కానీ భయపడ కుండా టిఆర్ఎస్ పార్టీ బతకాలన్న ఉద్దేశంతో తన కుటుంబం ఆర్థికంగా చిన్న భిన్నమైన ఎన్నో రోజులు తెలంగాణ ఉద్యమ సమయంలో నిద్రలు లేక తిండి లేక కాళ్లకు బలపం పట్టుకొని తెలంగాణ ఉద్యమాన్ని బతికించి తెలంగాణ వచ్చిన తర్వాత మూడుసార్లు మండల అధ్యక్షులుగా చేసిన బందెల రాములు కు ఎన్నికైన దళిత ఎమ్మెల్యే మాత్రం నామమాత్రంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇచ్చి మండల అధ్యక్షుడు పదవి మాత్రం రెడ్లకు అప్పజెప్పడం జరిగినది తెలంగాణ ఉద్యమమే ఊపిరిగా జీవించిన తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయి అన్న ఆశతో పనిచేసిన ఎవరూ లేని సమయంలో యువజన నాయకునిగా పనిచేసి తెలంగాణ వచ్చినాక అణిచివేయబడ్డ దళిత నాయకుడు నోముల శంకర్ఎవరూ లేని సమయంలో వెల్లంకి గ్రామం నుంచి అంగవైకల్యాన్ని లెక్క చేయ కుండా నేను తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటానని ఉద్యమాన్ని ముందుకు నడిపిన డాక్టర్ అశోక్ తెలంగాణ వచ్చినాక పూర్తిగా అణిచివేయబడ్డారు రామన్నపేటలో ఒక్క ఎస్సి లీడర్ కు ప్రోత్సాహం ఇవ్వకుండా కేవలం రెడ్లకు మాత్రమే ప్రోత్సాహం ఇవ్వడం వారికి కాంట్రాక్టులు ఇవ్వడం వారికి పదవులు ఇవ్వడంనాటి నుంచి నేటి వరకు మార్కెట్ కమిటీ నుంచి మొదలు సింగిల్ విండో చైర్మన్ వరకు పార్టీలు అన్ని రకాల పదవులు నామినేటెడ్ పదవులు రెడ్లకు కట్టబెట్టారు తప్ప ఒక్క ఎస్సీ లీడర్ కు ఇవ్వకపోవడం చాలా దురదృష్టకరం కేవలం పేరుకు మాత్రమే దళిత ఎమ్మెల్యేలురామన్నపేటలో 2009 నుంచి ఇప్పటివరకు దళిత లీడర్లను ప్రోత్సహించడం లో వీరు చాలా వెనుకబడి ఉన్నారు 20 సంవత్సరాల నుంచి ఒక్క దళిత లీడర్ ను తయారు చేయలేకపోయారు వీరికి ఆపద వస్తే నేను దళిత ఎమ్మెల్యేను కావున నన్ను అధికారులు అవమానించారునేను దళిత ఎమ్మెల్యేను కావుననన్ను రెడ్డి అవమానించాడు అని గగ్గోలు పెట్టారు తిరిగి పత్రికా ప్రకటనలో ఖండించాలన్న వీరి సొమ్ము తిన్న ఏ ఒక్క రెడ్డి నాయకులు కూడా పత్రిక ప్రకటన చేయడంలో ఆమడ దూరంలో ఉన్నారు తిరిగి ఎమ్మార్పీఎస్ నాయకులు గతంలో పనిచేసిన ఎస్సీ నాయకులు అభిమానంతో చూసి ఉండలేక అట్టి వార్తను ఖండించారు2009 నుంచి 2026 వరకు కేవలం పది సంవత్సరాలు టిఆర్ఎస్ ఎమ్మెల్యేగా 10 సంవత్సరాలు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఎవరు ఉన్నా రెండవ స్థానంలో ఉన్న దళిత లీడర్లను తయారు చేయడంలో ఈ దళిత ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమైనారు ఈ దళిత ఎమ్మెల్యేలు మాత్రం వారి పక్కన కూర్చో పెట్టుకోవడానికి కూడా తోటి దళితులు అంటే ఇష్టపడడం లేదు వీరు అధికారం కోల్పోతే వీరిని ప్రోత్సహించడానికి వీరిని వెన్ను తట్టి నిలపడానికి దళితులే కావాలి. వీరికి జై కొట్టడానికి వీరి కోసం దెబ్బలు తినడానికి దళితులే కావాలి. కానీ వీరుకి అధికారం వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవులు ఎన్ని ఉన్నా అన్ని రెడ్లకే ఇవ్వడం కొసమెరుపుఏదైనా సమస్య మీద దళితులు వారు ఇండ్ల వద్దకు వెళితే రెడ్డి ని కలవండి మీ పని చేసి పెడతాడు అని గత 20 సంవత్సరాల నుంచి దళిత ఎమ్మెల్యేలు చెప్పడం కోసమేరుపు ఆ రెడ్లు మాత్రం ఎక్కడ అధికారం ఉంటే గంపగుత్తగా అధికార పార్టీలోకి వెళ్లడం వారికి ఆనవాయితీగా మారింది ఈ దళిత ఎమ్మెల్యేలు తిరిగి వెనకకు చూసుకునే లోపు వారి జేబు కాస్త లాస్ అవుతుంది. ఏది ఏమైనా నేటికైనా దళిత ఎమ్మెల్యేల తీరు మారాలనిసర్పంచి టికెట్ కావాలన్నా పలాని గ్రామంలో ఉన్న రెడ్డిని కలవాలి ఇల్లు కావాలన్నా గ్రామంలో ఉన్న రెడ్డిని కలవాలిదళిత బంధు కావాలన్నా గ్రామంలో ఉన్న రెడ్డిని కలవాలిబీసీ బందు కావాలన్నా గ్రామంలో ఉన్న రెడ్డిని కలవాలిప్రభుత్వ పథకం ఏది వచ్చిన రెడ్డిని కలవాలి కానీ ఈ ఎమ్మెల్యేలకు ఆపద వస్తే వారికి అవమానం జరిగితే దళితులు గుర్తుకు వస్తారు ఒక్క దళిత లీడర్ ను తయారు చేయడంలో కనీసం పక్కకు కూర్చోబెట్టుకోవడంలో మీరు పూర్తిగా విఫలమైనారు రామన్నపేటలో దళితులకు గుర్తింపు ఎక్కడ నేటికైనా దళిత ఎమ్మెల్యేల తీరు మారాలని దళిత ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు

# ప్రజలకు డ్రైవింగ్,శాంతి భద్రతల అవగాహన సదస్సు నిర్వహించిన సిఐ రంజిత్ కుమార్



**తొలి అక్షరం/వరంగల్ :జనవరి19:** వరంగల్ పశ్చిమ నియోజక వర్గం 31 వ డివిజన్ న్యూశాయంపేటలో ప్రజలకు డ్రైవింగ్,శాంతి భద్రతలపై అవగాహన కల్పించేందుకు శాయంపేట చౌరస్తా కూడలి లో ప్రజలకు రక్షణ కల్పించే విధంగా సిఐ రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో న్యూ శాయంపేట యువతకు అవగాహన సదస్సును నిర్వహించినారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఆల్కహాల్ తాగి వాహనాలు నడిపి యాక్సిడెంట్ కు గురైతే కుటుంబం మొత్తం చిన్నా భిన్నమై కుటుంబం శోకసముద్రంలో పడే అవకాశం ఉంటుందని తెలిపారు.ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తద్వారా హెల్మెట్ అనేది ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందని తలకు గాయాలు కాకుండా కాపాడుతుందని ఒకవేళ ప్రమాదవశాత్తు ఆక్సిడెంట్ జరిగిన ప్రాణాలు కాపాడుకోవచ్చని తెలిపారు.ప్రజలకు శాంతిభద్రతలు కల్పించడమే ద్యేయం గా పనిచేస్తున్నామని అందుకుగాను ప్రభుత్వం సూచించే సూచనలను ప్రజలు తప్పనిసరిగా పాటించి ప్రభుత్వానికి సహకరించాలని తెలిపారు.గంజాయి మత్తులో మద్యం సేవించి వాహనాలు నడపరాదని అలా నడిపితే ప్రాణాలు సైతం పోతున్నాయని ఇటీవల సుమారుగా 8000 మంది ప్రాణాలు కోల్పోయారని తమ కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని ముఖ్యంగా యువత తమ భవిష్యత్తుకు మంచి మార్గం వేసుకోవాలని తప్పుడు మార్గాల ద్వారా తప్పుడు విధానాల ద్వారా మద్యం జోలికి,గంజాయి జోలికి పోవద్దని సూచించారు. యువత వారి వారి తల్లితండ్రులను విధిగా గౌరవించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సై పని,కానిస్టేబుల్స్,ఎన్సిసి విద్యార్థులు పాల్గొన్నారు

# గణతంత్ర దినోత్సవ వేడుకలలో అంబేద్కర్ చిత్రపటం తప్పనిసరి

**● మాల మహానాడు ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) భాస్కరరావుకు వినతి పత్రం అందజేత**



**తొలి అక్షరం:వలిగొండ, జనవరి, 19:** ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలో రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటం పెట్టాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు పెరుమాండ్ల యాదగిరి, వలిగొండ మండల అధ్యక్షులు కూచిమల్ల నాగేష్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) భాస్కరరావు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామం నుండి జిల్లా వరకు గవర్నమెంట్ ఆఫీసులలో, ప్రైవేట్ ఆఫీసులలో, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో జనవరి 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలలో అంబేద్కర్ చిత్రపటం ఉండేలా సూచించాలని అడిషనల్ కలెక్టర్ ను వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కాశమల్ల శేఖర్, సహాయ కార్యదర్శి కట్ట సురేష్, సంస్కృతిక కార్యదర్శి కూచిమల్ల కుమార్, వెలువర్తి గ్రామ అధ్యక్షులు కూచిమల్ల నాగేంద్ర ప్రసాద్, సీనియర్ నాయకులు వలమల్ల రత్నయ్య, జక్క స్వామి, మద్దెల వెంకటేశం, బెల్లపు కృష్ణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# చీకటి రహదారికి శాశ్వత వెలుగులు



**● భద్రత, వ్యాపారం, సౌందర్యానికి ఊతం**

**● షాద్ నగర్ చౌరస్తా నుండి అన్నారం వై జంక్షన్ సెంట్రల్ లైటింగ్ ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్**





**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 19:** షాద్‌నగర్ పట్టణానికి నూతన రూపు వచ్చింది.పట్టణ ముఖ్య కూడలి నుంచి అన్నారం వై జంక్షన్ వరకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) నిధులతో రూ.90 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు.ఈ రహదారి వెంబడి నెలకొన్న చీకటిని తొలగిస్తూ పట్టణానికి భద్రత, అందం, అభివృద్ధికి కొత్త దిశ చూపించిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటివరకు రాత్రి వేళ ఈ ప్రధాన రహదారిపై ప్రయాణం అంటేనే భయం.సరైన వెలుతురు లేక ప్రమాదాలు, చోరీలు, ఆకతాయిల బెడద పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.ఇప్పుడు సెంట్రల్ లైటింగ్ వెలుగులతో రహదారి మొత్తం స్పష్టంగా కనిపిస్తుండటంతో వాహనదారులు,ద్విచక్ర వాహనదారులు నిర్భయంగా ప్రయాణం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని ట్రాఫిక్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.రాత్రి వేళ బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నుంచి ప్రజలు బయటపడ్డారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు నిశ్చింతగా రాకపోకలు సాగించగలుగుతున్నారు. ఆకతాయిల బెడద తగ్గడంతో భద్రతాభావం పెరిగిందని స్థానికులు చెబుతున్నారు.ఈ రహదారి వెంబడి ఉన్న దుకాణాలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలకు సెంట్రల్ లైటింగ్ వరంగా మారింది. రాత్రి వేళ కూడా వినియోగదారుల రాక పెరుగుతుండటంతో వ్యాపారం జోరందుకుంటోందని వ్యాపారులు తెలిపారు. దీంతో స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు ఊపు రానుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.**పట్టణ సౌందర్యం పెరిగింది** సెంట్రల్ లైటింగ్ వల్ల షాద్‌నగర్ పట్టణానికి ఆధునిక నగరాల తరహా రూపు వచ్చింది.రాత్రివేళ రహదారి వెలుగులతో మెరిసిపోతూ నగర సుందరి కారంగా తలపిస్తోందని యువత అభిప్రాయపడుతోంది.పట్టణానికి వచ్చే సందర్శకులపై మంచి ముద్ర పడుతోందని పలువురు పేర్కొన్నారు.ఈ లైటింగ్ వ్యవస్థలో ఆధునిక ఎల్‌ఈడి దీపాలను వినియోగించడం వల్ల విద్యుత్ వినియోగం తగ్గి మున్సిపాలిటీపై ఆర్థిక భారం తగ్గనుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, సీనియర్ నాయకులు అగ్గనూర్ బస్వం శ్రీశైలం గౌడ్, కృష్ణా రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, కొప్పునూరి ప్రవణ్, సర్వర్ పాషా, మసూద్ ఖాన్, కోన దేవయ్య, పెంటయ్య, మాధవులు యాదవ్, నీరటి వాసు, తుపాకుల శేఖర్, మనీష్, గంగమోని సత్తయ్య, పాషా, అర్జున్ లక్మన్, భాస్కర్ గౌడ్, కిరణ్, చందు, ముబారక్ అలీ ఖాన్, షఫీద్దిన్, రవితేజ, జగదీశ్వర్, కరుణాకర్, మహబూబ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# 12కోట్ల నిధులతో జేపీ దర్గా అభివృద్ధి... పరిసర ప్రాంతానికి కొత్త వెలుగులు

**రూ.12 కోట్లతో రూపుమారనున్న బస్సు స్టాండ్, సీసీ రోడ్లు, వక్ఫ్ బోర్డ్ భవనం, మల్టీ పర్పస్ భవనం**





**తొలి అక్షరం/షాద్ నగర్, జనవరి 19:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రసిద్ధి గాంచిన ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఒకటైన జహంగీర్ పీర్ దర్గా (జేపీ దర్గా) సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసింది. దర్గాను అత్యంత వైభవంగా తూపురేఖలు మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ భారీ నిధులు కేటాయించారు. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దే దిశగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఏ) నిధుల కింద రూ.12 కోట్లను మంజూరు చేసినట్లు తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ప్రకటించారు.మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూడ ఫేస్ వన్ నిధులలో భాగంగా ఈ రూ.12 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.ఇందులో బస్టాండ్ నిర్మాణం, వక్ఫ్ బోర్డు భవనం, అండర్ డ్రైనేజ్ వ్యవస్థ, సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డు చైర్మన్ సయీద్ అజ్మత్ ఉల్లా ఉసేని మాట్లాడుతూడబస్టాండ్ నిర్మాణానికి రూ.5 కోట్లు,సీసీ రోడ్లకు రూ.2 కోట్లు 47 లక్షలు,ఆఫీస్ కాంప్లెక్స్‌కు రూ.50 లక్షలు,ఆఫీస్ బిల్డింగ్‌కు రూ.50 లక్షలు, మల్టీ పర్పస్ హాల్‌కు రూ.50 లక్షలు,జేపీ దర్గా నుంచి ఇమూల్ నర్వ రోడ్డుకు రూ.2 కోట్ల 70 లక్షలు మంజూరు చేసినట్లు వివరించారు.ఈ పనులన్నీ త్వరలో ప్రారంభం కానున్నాయని,దర్గాకు వచ్చే భక్తులకు మరింత సౌకర్యవంతమైన వసతులు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు.జేపీ దర్గా పరిసర ప్రాంత ప్రజలు ఈ అభివృద్ధి పనులపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం మరియు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూడజేపీ దర్గాను ఆధ్యాత్మికంగా పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉంది.భవిష్యత్తులో మరిన్ని నిధులు మంజూరు చేసి పరిసర ప్రాంతాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మాజీ జడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, సిద్దాపూర్ శేఖర్ రెడ్డి, మసూద్ ఖాన్, ప్రభాకర్, గోపాల్ నాయక్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి బురదలో పాలకులు !




ప్రత్యేక తెలంగాణతో దగాపడ్డది ఇరు రాష్ట్రాల ప్రజలే అని నిత్యం చెప్పుకోవాల్సిందే. ఇక్కడ తెలంగాణ ప్రజలు, అక్కడ ఆంధ్రా ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. రాజకీయ నేతలు బాగుపడ్డారు. ఇంకా బాగుడడానికి కావాల్సిన ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రత్యేకించిం తెలంగాణలో పదేళ్ల పాలనా కాలంలో బిఆర్ఎస్ చేయని అవినీతి లేదు. చివరకు అప్పులు చేసి కుప్పగా మార్చారు. ఎదురుదాడి విమర్శలతో రాజకీయాలు నెరుపుతున్నారు. ఎపిలో కూడా జగన్ అరాచకీయం తారాస్థాయికి చేరింది. ఐదేళ్లలోనే ఎపి గందరగోళంలోకి నెట్టబడింది. ఇప్పుడు చేసిన అప్పులను తీర్చే బదులు ఇరు రాష్ట్రాల్లో మళ్లీ అప్పులు చేస్తున్నారే తప్ప ఆర్థిక క్రమశిక్షణ పాటించడం లేదు. తాజాగా తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలు రెండేళ్లలోనే బిఆర్ఎస్ ను మించి సాగుతున్నాయి. మంత్రులు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఎవరికి వారు సొంత ఖాతాలు తెరిచారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. తాజాగా డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కపై వచ్చిన ఆరోపణలు కంపు లేపాయి. దీంతో సింగరేణి నైనీ బొగ్గు టెండర్ల ప్రక్రియ రద్దయ్యింది. ఇక్కడే మరిన్ని అనుమానాలు కలుగుతున్నాయి. అవినీతి లేకుంటే టెండర్లు ఎందుకు రద్దు చేశారో చెప్పాలి. తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలు నానాటికీ తీసికట్టు అన్నట్లుగా తయారయ్యాయి. నిత్యం బిఆర్ఎస్‌ను తిట్టిపోస్తూ వారు చేస్తున్నది కూడా అదే. నేటి వరకు ఒక్క విప్లవాత్మక నిర్ణం తీసుకోలేదు. రేషన్ కార్డులు ఇవ్వడం, సన్నబియ్యం పంపిణీ చేయడం, పెన్షన్లు ఇవ్వడం, ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ఇదే అభివృద్ధిగా చూపుతున్నారు. ఇవి చూపి తప్పించుకుందామని అనుకున్నా..దందాల బాగోతం మంత్రుల మధ్య చిచ్చు రేపుతోంది. తమ శాఖల్లో ఏం జరుగుతుందో పరివీలించి పర్యవేక్షించే బాధ్యతను మంత్రులు మరిచిపోయారు. కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భట్టి విక్రమార్కల తీరు రాజకీయంగా చిచ్చు రేపుతోంది. అవినీతి చుట్టూ వీరి పాలన సాగుతోంది. మంత్రులపై బురదచల్లడాలు, అనుకూల మీడియాతో అవినీతి ఆరోపణలు, అధికారులపై వ్యక్తిత్వ హననాలు ప్రస్తుతం చర్చగా మారాయి. ముఖ్యనేత అనే గౌరవం లేకుండా కొండా సురేఖ కూతురు దారుణంగా దూషించారు. ఆమెకు దేవాదాయ శాఖలో ఏం జరుగుతుందో తెలుసుకునే వీలు పడడం లేదు. అలవీశాఖలో ఏం జరుగుతుందో తెలియదు. ఎన్ని దేవాలయాల భేములు అన్యాక్రాంతం అయ్యాయో, వాటిని ఎలా వెనక్కి తీసుకోవాలో కూడా తెలియడం లేదు. ఆమె మంత్రిగా ఉండడం దౌర్భాగ్యం తప్ప మరోటి కాదు. ఆమె ముందూ వెనకా ఆలోచించకుండా నాగార్జునపై నోరు పారేసు కున్నారు. తరవాత నాలిక కరుచుకున్నారు. ఒకవైపు కుమ్ములాటలు, కీచులాటల తో కాంగ్రెస్ చుక్కాని లేని నావలా తయారయ్యింది. అధికారం వస్తే కాంగ్రెస్‌కు పట్టాపగ్గాలు ఉండవన్న పాత నానుడిని నిజం చేస్తున్నారు. గోతులు తవ్వుకునే సంస్కృతి ఆ పార్టీలో ఎప్పటి నుంచో ఉన్నది. కాంగ్రెస్‌లో ఒకరు ఎక్కువ కాదు..ఒకరు తక్కువా కాదు. ఆధిపత్య కుమ్ములాటలో అందరూ అందరే అనే భావన ప్రజల్లో ఉన్నది. నీచ, నికృష్టపు, దిగజారుడు రాజకీయాల కోసం అల్లే కట్టుకథలు నన్నేం చేయలేవు అంటున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎందుకు సింగరేణి టెండర్లు రద్దు చేశారో చెప్పడం లేదు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీద ఓ మీడియా సంస్థ ప్రసారం చేసిన అనైతిక కథనం వెనుక నిగ్గు లేఆల్సి ఉంది. సింగరేణి టెండరల్ వ్యవహారంలోనూ నిగ్గులేల్చాలి. పలువురు మంత్రులు అవినీతికి పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు వస్తున్నా ..ఎవరు పట్టించుకుంటారో..వారిని ఎవరు కంట్రోల్ చేస్తారనో కూడా తెలియని దుస్తితి నెలకొంది. మేడారం అభివృద్ధి పనుల టెండర్లకు సంబంధించి రూ.100 కోట్ల విలువైన కాంట్రాక్ట్ పనుల విషయంలో మంత్రులు పొంగులేటి, సురేఖ మధ్య విభేదాలు బట్టబయలయ్యాయి. మేడారం జాతర దేవాదాయ శాఖ పరిధిలోనిదని, పైగా తన జిల్లాకు చెందినదని, ఇందులో పొంగులేటి చొరబడి కాంట్రాక్టులు తన అనుచరులకు ఇప్పించు కున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు, సీఎంకు సురేఖ ఫిర్యాదు చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ యజమాని కణతకు మంత్రి కొండా సురేఖ ఓఎస్డీ గన్ను గురిపెట్టిన వ్యవహారం రాష్ట్రంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. బొగ్గుగని కోసం ఇద్దరు మంత్రులు కొట్లాడుకుం టున్నారని విమర్శలు చెలరేగాయి. కోట్ల విలువైన కాంట్రాక్టు పనులు దక్కించుకోవడానికి కోమటిరెడ్డి, భట్టి ఒకరిపై ఒకరు కత్తులు నూరుకుంటున్నారని చివరకు తేలింది. లాభదాయకమైన వ్యాపారం కోసం ఇద్దరు మంత్రులు తగువు పడుతున్నది ముమ్మాటికీ నిజం. కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీద ప్రసారమైన అనైతిక కథనం ఇందులో భాగమేనని తేలింది. దీంతో ఇద్దరి మధ్యన లొల్లితో అవినీతి మరింత బట్టబయలు అయ్యింది. ఏతావాతా కాంగ్రెస్ గత పాత వాసనలను వదులుకోవడం లేదు. అవినీతికి దూరంగా ఉండలేక పోతున్నది. బిఆర్ఎస్ పదేళ్ల అవినీతిపై విరుచుకు పడుతున్నవారు తమ చేస్తున్నది గుర్తించడం లేదు. కళ్లు మూసుకుని పిల్లి పాలు తాగిందన్న చందంగా కాంగ్రెస్ మంత్రుల వ్యవహారం నడుస్తోంది. పరిస్థితి ఇలాగే ఉంటే తెలంగాణ మరింత భ్రష్టు పోవడం ఖాయం. అభివృద్ధి పక్కకు పోయి, అప్పుల్లో మరింత కూరుకు పోవడం ఖాయం. పాలకుల దుర్మార్గాలకు బలవడం ఎంతో దూరం లేదు. అవినీతి బురద నుంచి బయటపడక పోతే ప్రజల చేతిలో పరాభవం తప్పదు.




# దుల్కర్ హీరోయిన్ సాత్విక గ్లింప్స్ విడుదల

దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఆకాశంలో ఒక తార' . ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుగుతోంది. తాజాగా ఈ సినిమాలో హీరోయిన్‌ను పరిచయం చేశారు. సాత్విక వీరవల్లి ఇందులో కథానాయికగా నటించనున్నట్లు తెలుపుతూ గ్లింప్స్ విడుదల చేశారు. కనీస వసతులు కూడా లేని పల్లెటూరిలో పుట్టిన అమ్మాయి తన కలలను ఎలా సాధించుకుంది అనే కథాంశంతో ఈ చిత్రం రూపొందనున్నట్లు గ్లింప్స్ ఆధారంగా తెలుస్తోంది. వేసవి కానుకగా ఈ సినిమా విడుదల కానుంది.


## వరుణ్‌తేజ్ మూవీ 'కొరియన్ కనకరాజు'

అంచనాలు ఏర్పడ్డాయి. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ హారర్ కామెడీ-ఫాంటసీ ఎంటర్‌టైనర్ నుంచి తాజాగా విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమా పై క్రేజ్‌ను మరింత పెంచింది. వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా ప్రాజెక్ట్ టైటిల్‌తో పాటు గ్లింప్స్‌ను విడుదల చేయగా, అది అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమాతో వరుణ్ తేజ్ తొలిసారిగా హారర్ ఫాంటసీ జానర్‌లో అడుగుపెడుతున్నారు. గ్లింప్స్‌లో ఆయన మాస్ లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విదేశాల్లోని ఒక పోలీస్ స్టేషన్ నేపథ్యంలో సాగే సన్నివేశంలో, కమెడియన్ సత్యను పోలీసులు కొడుతుండటం, ఆ సమయంలో కామెడీ ట్రాక్ నడుస్తూనే హీరో స్టైలిష్‌గా ఎంట్రీ ఇవ్వడం ప్రేక్షకులకు హుషారును కలిగిస్తోంది. 'వీడు మన కనకరాజు కాదమ్మో' అంటూ సత్య చెప్పే డైలాగ్‌కు, 'నేను తిరిగొచ్చేశా' అంటూ వరుణ్ తేజ్ కొరియన్ భాషలో ఇచ్చే కౌంటర్ ప్రత్యేకంగా హైలైట్ అవుతోంది. ఈ సన్నివేశం సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే సీనియర్ నటి తులసి, కమెడియన్ సత్య కీలక పాత్రల్లో కనిపించనున్నారు. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టంల్గ÷న్మెంట్స్ బ్యానర్లపై ఈ సినిమాను భారీ స్థాయిలో సంయుక్తంగా నిర్మిస్తున్నారు. లెజెండరీ కంపోజర్ తమన్ స్వరాలు సమకూరుస్తున్నారు. వరుణ్ తేజ్ ? తమన్ కాంబోలో గతంలో వచ్చిన 'తొలిప్రేమ' సినిమా మ్యూజికల్‌గా పెద్ద హిట్ కావడంతో, ఈ సినిమాపై కూడా మ్యూజిక్ పరంగా భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న ఈ సినిమాను సమ్మర్ సీజన్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. గత కొంతకాలంగా వరుణ్ తేజ్‌కు సరైన కమర్షియల్ హిట్ పడకపోవడంతో, 'కొరియన్ కనకరాజు'తో ఆయన బలమైన కమ్‌బ్యాక్ ఇస్తారని అభిమానులు ఆశిస్తున్నారు. హారర్, కామెడీ, ఫాంటసీ అంశాలను మేళవిస్తూ రూపొందుతున్న ఈ సినిమా, వరుణ్ తేజ్ కెరీర్‌లో ఒక ప్రత్యేకమైన మైలురాయిగా నిలుస్తుందేమో అన్న అంచనాలు ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి.



## ఎక్కువ పారితోషికం వార్తల్లో నిజంలేదు

పబ్లిక్ లైఫ్ లో ఉండే తారలపై రూమర్లు తప్పవని నటి రష్మిక మందన్న చెప్పారు. కొన్ని రూమర్లు ఎంతగానో బాధిస్తాయని తెలిపారు. అయితే, రూమర్లు సృష్టించే వారు కేవలం వ్యూస్ తో వచ్చే డబ్బు కోసమే ఆ పని చేస్తారని రష్మిక అన్నారు. ఓ చిట్ చాట్ లో అభిమానుల ప్రశ్నలకు జవాబులిస్తూ రష్మిక పలు ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు. "మీడియాలో, సోషల్ మీడియాలో వ్యూస్ కోసం కొంతమంది రూమార్లు సృష్టిస్తుంటారు.. నిజం చెప్పాలంటే ఆ వార్తలు కూడా ఎంతోమందిని పోషిస్తున్నాయి. అందుకే బతకనీ లెమ్మని వదిలేస్తా" అంటూ రష్మిక ఓ అభిమానికి జవాబిచ్చారు. 2016 నుంచి ఇప్పటివరకూ ఒకేలా పనిచేస్తున్నానని రష్మిక చెప్పారు. అన్ని భాషల్లో, అన్ని రకాల చిత్రాల్లోనూ నటించాలనేది తన కోరిక అని చెప్పుకొచ్చారు. భాషాపరమైన హద్దులు పెట్టుకోకుండా సినిమాలను ఎంచుకుంటున్నట్లు తెలిపారు. ఒక హీరోయిన్ గా ప్రేక్షకులకు వినోదాన్ని పంచడమే తన పని అని, అందరికీ నచ్చేలా వైవిధ్యమైన చిత్రాలు చేయడానికి ప్రయత్నిస్తుంటానని వివరించారు. ఇండస్ట్రీలో ఉన్నవారికి నెగెటివిటీ అనేది కామన్ అని రష్మిక చెప్పారు. నటులు అందరి పైనా ఎప్పుడూ ఏవేవో వార్తలు వస్తూనే ఉంటాయన్నారు. అయితే, ఏదో ఒకరోజు ప్రజలకు నిజం తెలుస్తుందనే ఉద్దేశంతోనే వాటిపై స్పందించడం లేదని వివరించారు. జీవితంలో జరిగిన ప్రతి విషయం నుంచి ఏదో ఒకటి నేర్చుకుంటూ ముందుకుసాగుతున్నానని తెలిపారు. ఇండస్ట్రీలో అత్యధిక పారితోషికం తీసుకునే నటి అంటూ తనపై వచ్చిన రూమర్లపై రష్మిక స్పందించారు. అది నిజమైతే బాగుండని తాను కూడా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. తాను హీరోయిన్ గా నటించే సినిమాల్లో ఐటెం సాంగ్ లు చేయడానికి సిద్ధమేనని చెప్పారు. ఇండస్ట్రీలోని ముగ్గురు డైరెక్టర్లు అడిగితే తాను హీరోయిన్ కాకున్నా సరే వారి సినిమాల్లో ఐటెం సాంగ్ లు చేయడానికి సిద్ధమని రష్మిక తెలిపారు. అయితే, ఆ డైరెక్టర్లు ఎవరనేది మాత్రం రష్మిక వెల్లడించలేదు.



## 100 కోట్ల క్లబ్‌లో 'అనగనగా ఒక రాజు'

యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి బాక్సాఫీస్ వద్ద మరోసారి తన సత్తా చాటారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'అనగనగా ఒక రాజు' చిత్రం కేవలం ఐదు రోజుల్లోనే రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం సృష్టించింది. సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలైన ఈ సినిమా, కంటెంట్ ఉన్న చిత్రాలకు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారని మరోసారి రుజువు చేసింది. స్టార్‌డమ్ కంటే కథకే ప్రాధాన్యత ఇచ్చే నవీన్, ఈ చిత్రంతో తన మార్కెట్‌ను అగ్రస్థాయికి తీసుకెళ్లారు.

తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్లిన ఈ చిత్రం వసూళ్లలోనూ అదే జోరు చూపించింది. మొదటి రోజే రూ. 22 కోట్ల గ్రాస్ సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. కేవలం మూడు రోజుల్లో రూ. 61.1 కోట్లు రాబట్టిన ఈ సినిమా, ఐదు రోజులు పూర్తయ్యేసరికి రూ. 100.2 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్టు నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధికారికంగా ప్రకటించింది. పెద్ద సినిమాల పోటీ మధ్యలోనూ నవీన్ సినిమా ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం విశేషం.

క్లీన్ కామెడీ, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగాలతో దర్శకుడు మారి ఈ చిత్రాన్ని తెరకెక్కించిన తీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా నవీన్ పోలిశెట్టి తనదైన కామెడీ టైమింగ్, డైలాగ్ డెలివరీతో సినిమాకు ప్రాణం పోశారని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. 'ఇదే అసలైన పండగ సినిమా' అంటూ ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్ల నుంచి బయటకు వస్తుండటం ఈ సినిమా విజయానికి నిదర్శనంగా నిలుస్తోంది.



# అందరినీ ప్రేమించే తత్వం భారత్ సొంతం

### ఎఆర్ రహమాన్ వ్యాఖ్యలను విభేదించిన తస్లీమా నస్రీన్



తాను ముస్లిం కావడం వల్లే బాలీవుడ్‌లో అవకాశాలు తగ్గాయని, మారిన అధికార సమీకరణాలు కూడా అందుకు ఓ కారణం కావొచ్చని ఆస్కార్ అవార్డు గ్రహీత, సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. ఆ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ చేసిన వ్యాఖ్యలను బాలీవుడ్ ప్రముఖులతో సహా అందరూ ఖండిస్తున్నారు. తాజాగా సంచలన రచయిత తస్లీమా నస్రీన్ కూడా స్పందించారు. ఆమె తన ఎక్స్ అకౌంట్‌లో ఓ పోస్టు చేశారు.

ఏఆర్ రెహ్మాన్ మనోవేదనను ఆమె తప్పుపట్టారు. రెహ్మాన్ ముస్లిం వ్యక్తే అని, భారత్‌లో ఆయన ఓ ఫేమస్ వ్యక్తి అని, ఇతర ఆర్టిస్టులకన్నా ఆయన సంపాదన ఎక్కువే అని, బహుశా సంపన్న సంగీత దర్శకుడు అయి ఉంటారని, కానీ ముస్లిం కావడం వల్లే బాలీవుడ్‌లో అవకాశాలు రావడం లేదని రెహ్మాన్ ఫిర్యాదు చేస్తున్నారని ఆమె చెప్పారు. బాలీవుడ్‌లో షారుక్ బాద్‌షా అని, సల్మాన్, ఆమిర్, జావిద్ అక్తర్, షబానా అజ్మీ అందరూ సూపర్ స్టార్లే అని ఆమె తెలిపారు. సంపన్నులు, ఫేమస్ వ్యక్తులకు ఎక్కడ ఇబ్బందికర పరిస్థితులు ఉండవని, ప్రాంతం ఏదైనా, కులం ఏదైనా, వర్గం ఏదైనా సమస్య ఉండదని తస్లీమా అన్నారు. కానీ నాలాంటి పేదలకు సమస్యలు ఉంటాయన్నారు. తాను హేతువాదినని, ఎక్కడకు వెళ్లినా సమస్యలు ఎదుర్కొన్నట్లు చెప్పారు. కానీ ఏఆర్ రెహ్మాన్‌ను హిందువులు, ముస్లింలు, బౌద్ధులు, క్రైస్తవులు, హేతువాదులు విశ్వసిస్తారని, ఆయన మీద జాలిపడే సందర్భం కాదు అన్నట్లు తస్లీమా నస్రీన్ అన్నారు.